

రూ.32 లక్షల చోరీ సొత్తు స్వాధీనం

- పాత నేరస్థుడి అరెస్టు

- 8వ పేజీలో



షేమ్ సీన్

వేమన మందిరం స్థలం స్వాధీనానికి మరోసారి జీవీఎంసీ అధికారుల యత్నం

అడ్డుకున్న కూటమి ప్రజా ప్రతినిధులు

- లీజుకు ఇచ్చి 25 ఏళ్లు దాటినందున మునిసిపల్ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకున్నామని వివరించబోయిన జోన్-4 సిబ్బంది
- వినిపించుకోని నేతలు
- ఉన్నతాధికారులకు ఫోన్ చేసి ఒత్తిడి చేయడంతో సీల్ తొలగింపు



మధ్యాహ్నం రెండు గంటలకు తిరిగి సీల్ తొలగించడంతో తెరిచివున్న వేమనమందిరం



వేమనమందిరంలో మధ్యాహ్నం 12 గంటలకు సీజ్‌చేస్తున్న జోన్-4 రెవెన్యూ సిబ్బంది

విశాఖపట్నం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి):

నగరంలో కొంతమంది ప్రజా ప్రతినిధులు తమ అస్మదీయులకు మేలు చేకూర్చేందుకు జీవీఎంసీ ఆదాయానికి గండి కొట్టేందుకు కూడా వెనుకాడడం లేదు. తాజాగా వేమన మందిరం విషయంలో అధికారులు చర్యలు తీసుకుంటే ముగ్గురు ప్రజా ప్రతినిధులు మోకాలడ్డడం, ప్రైవేటు వ్యక్తులకు ప్రయోజన కలిగేలా సాక్షాత్తూ జిల్లా ఉన్నతాధికారిపైనే ఒత్తిడి తీసుకురావడం చర్చనీయాంశంగా మారింది.

ఆశీల్‌మెట్ట జంక్షన్‌లో తెలుగుతల్లి ఫ్లైఓవర్‌కు ఆనుకుని జీవీఎంసీకి చెందిన స్థలంలో వేమన మందిరం ఉంది. 1980లో వాల్తేరు సర్వే నంబర్ 1082లో వేసిన అప్రూవ్డ్ లేఅవుట్‌లోని 1,200 చదరపు గజాల రిజర్వు స్థలాన్ని శ్రీవేమన సంక్షేమ సంఘానికి నెలకు రూ.500 చెల్లించేలా పదేళ్ల కాలానికి విశాఖపట్నం మునిసిపల్ కార్పొరేషన్ లీజుకు ఇచ్చింది. ఆ స్థలంలో సంఘం లైబ్రరీ, ఆలయాన్ని నిర్మించింది. 1986లో జీవీఎంసీ నుంచి అనుమతి తీసుకుని శాశ్వత భవనం నిర్మించింది. తర్వాత అంచెలంచెలుగా లీజును పొడిగించుకుంటూ వచ్చారు. ప్రస్తుతం జీవీఎంసీకి నెలకు రూ.4,141 చొప్పున లీజు చెల్లిస్తున్నారు. మునిసిపల్ చట్టం ప్రకారం ఏదైనా ఆస్తిని ఒకరికి 25 ఏళ్లకు మించి లీజుకు ఇవ్వడానికి అవకాశం లేకపోవడంతో వేమన మందిరాన్ని అప్పగించాలని జీవీఎంసీ అధికారులు కొన్నేళ్ల కిందట శ్రీవేమన సంక్షేమ సంఘానికి నోటీసు జారీచేశారు. అయినప్పటికీ గత ప్రభుత్వంలోని పెద్దలతో జీవీఎంసీ అధికారులపై ఒత్తిడి తెచ్చి ఖాళీ చేయకుండా కాలం గడిపేశారు. వేమన మందిరం లీజు కాలపరిమితి 25 ఏళ్లు దాటిపోయి దశాబ్దం అవుతున్నందున తిరిగి లీజుకు ఇచ్చేందుకు అనుమతి ఇవ్వాలంటూ గత ప్రభుత్వానికి రెండేళ్ల కిందట లేఖ రాశారు. ఆ లేఖను పట్టించుకోవద్దని మునిసిపల్ శాఖ అధికారులను గత ప్రభుత్వం ఆదేశించింది. అప్పటి నుంచి లీజు చెల్లింపును కూడా వేమన సంక్షేమ సంఘం నిలిపివేసింది. ఈ నేపథ్యంలో గతనెల 28న వేమన మందిరాన్ని జోన్-4 రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. అయితే జీవీఎంసీ కార్యవర్గంలో కీలకంగా వ్యవహరిస్తున్న వైసీపీ నేతను వేమన సంక్షేమ సంఘం పెద్దలు కలిసి తిరిగి తమకు అప్పగించేలా అధికారులను ఆదేశించాలని కోరారు. తమ పార్టీ ఓటమి పాలైపోయినందున కూటమి పెద్దలను కలవాలని ఆయన సలహా ఇచ్చారు. తమకు కూటమి ప్రజా ప్రతినిధులతో పరిచయాలు లేవని చెప్పడంతో సదరు వైసీపీ నేతే తనకు సన్నిహితంగా ఉండే కూటమిలోని ఒక ప్రజా ప్రతినిధికి ఫోన్ చేసి విషయం చెప్పారు. ఎలాగైనా వేమన మందిరాన్ని తిరిగి వారికే అప్పగించాలని కోరడంతో సదరు ప్రజా ప్రతినిధి జోన్-4 అధికారులకు ఫోన్ చేసి నోటీసు ఇవ్వకుండా ఎలా సీజ్ చేస్తారని నిలదీయడంతోపాటు లీజు

... మిగతా 6వ పేజీలో

జీబీఎస్ కలకలం

కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

- ఆస్పత్రిలోని రెండు విభాగాల్లో మరో ఐదుగురు బాధితులు
- లక్షణాలు కనిపించిన వెంటనే అప్రమత్తం కావాలంటున్న వైద్యులు
- కాచి చల్లార్చిన నీటిని తాగాలని, వేడి ఆహార పదార్థాలు తీసుకోవాలని, బయట ఆహారానికి దూరంగా ఉండాలని సూచన

విశాఖపట్నం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి):

గులియన్ బారే సిండ్రోమ్ (జీబీఎస్) బారినపడి సోమవారం ఒక మహిళ మృతిచెందడంతో జిల్లా వాసులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం మరో ఐదుగురు బాధితులు కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. వారిలో నలుగురు జనరల్ మెడిసిన్ వార్డులో, మరొకరు న్యూరాలజీ విభాగంలో ఉన్నారు. ఐదుగురి పరిస్థితి నిలకడగా ఉన్నట్టు వైద్యులు చెబుతున్నారు. అయితే, గతంలో ఎన్నడూ లేని విధంగా జీబీఎస్ కేసులు వరుసగా నమోదవుతుండడం కలవరపరుస్తోంది.





అప్రమత్తం కావాల్సిందే..

జ్వరం, జలుబు, దగ్గు, డయేరియా వంటివి వచ్చి తగ్గిన వారం, పది రోజుల్లో కాళ్లు, చేతులు నీరసంగా ఉండడం,తిమ్మిర్లు ఎక్కడం, గొంతులోకి ముద్ద దిగకపోవడం, ఊపిరి తీసుకోవడంలో ఇబ్బంది ఉండడం, కాళ్లలో మంటలు వంటి లక్షణాలు కనిపిస్తే అప్రమత్తం కావాలని వైద్యులు సూచిస్తున్నారు. లక్షణాలు కనిపించిన వెంటనే వైద్య సేవలు పొందాలని, లేనిపక్షంలో ఊపిరి తీసుకోవడంలో ఇబ్బంది తలెత్తి ప్రాణాలు పోయే అవకాశం ఉందని చెబుతున్నారు.

డయేరియా వస్తే జాగ్రత్త..

జీబీఎస్ బారినపడేలా చేయడంలో ఒక బాక్టీ రియా కీలకంగా వ్యవహరిస్తుందని చెబుతున్నారు. అదే కాంపెలోబాక్టర్ జెజునీ. ఈ బాక్టీరియా వల్ల డయేరియా వస్తుంది. ప్రధానంగా కలుషిత నీటిని, ఆహారాన్ని తీసుకోవడం వల్ల ఈ బాక్టీ రియా బారినపడే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. ఈ బాక్టీరియా బారినపడిన వాళ్లు తీవ్రమైన విరేచనాలతో బాధపడతారు. ఆ సమస్య తగ్గిన వారం రోజులకు కాళ్లు చచ్చుబడిపోవడం, ఇతర సమస్యలతో రోగులు ఆస్పత్రుల్లో చేరుతుంటారని, కొన్నిసార్లు డయేరియా లేకపోయినా కూడా జీబీఎస్ బారినపడవచ్చునని వైద్యులు చెబుతున్నారు.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి..

కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ఈ వ్యాధి బారినపడకుండా ఉండవచ్చునని వైద్యులు చెబు తున్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలి. వేడి ఆహార పదార్థాలు తీసుకోవాలి. బయట ఆహారా నికి దూరంగా ఉండాలి. ఇన్‌ఫెక్షన్లు బారినపడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. పోషకాలతో కూడిన ఆహారం తీసుకోవడం, శారీ రక వ్యాయామాలు చేయడం, మంచి నిద్ర ద్వారా వ్యాధి నిరోధక శక్తిని పెంపొందించుకోవాలి.

ఇదీ చికిత్స..

వ్యాధి బారినపడిన వారికి ఇమ్యునోగ్లోబులిన్స్ ఇంజెక్షన్లు అందిస్తారు. అలాగే, రక్త శుద్ధి పద్ధతి ద్వారా రోగి కోలుకునేలా చేయవచ్చునని వైద్యులు

... మిగతా 6వ పేజీలో

పెద్దాస్పత్రిలో ఇమ్యునోగ్లోబులిన్స్ ఇంజెక్షన్ల కొరత

- జీబీఎస్ బాధితులకు చికిత్సలో అవే కీలకం
- సామాన్యులు బయటే కొనుగోలు చేయాలంటే కష్టమే
- ఒక్కో ఇంజెక్షన్ ఖరీదు రూ.10 వేల నుంచి 15 వేలు...

విశాఖపట్నం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి):

గులియన్ బారే సిండ్రోమ్ (జీబీఎస్) బారినపడి కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న వృద్ధురాలు మృతిచెందడానికి వైద్యం సరిగా అందకపోవడమే కారణమనే వాదన వినిపిస్తోంది. చికిత్సలో కీలకమైన ఇమ్యునోగ్లోబులిన్స్ ఇంజెక్షన్లను ఆశించిన స్థాయిలో ఇవ్వలేదని చెబుతున్నారు. సాధారణంగా ఈ వ్యాధి బారినపడిన వారికి బరువును బట్టి ఇమ్యునోగ్లోబులిన్స్ ఇంజెక్షన్లు ఇవ్వాల్సి ఉంటుంది. ఉదాహరణకు 50 కిలోల బరువున్న రోగికి 20 గ్రాములు ఇంజెక్షన్ ఇవ్వాల్సి ఉంటుంది. ఒక్కో వయల్ ఖరీదు రూ.10 వేల నుంచి

... మిగతా 6వ పేజీలో

రికార్డుల ట్యాంపరింగ్‌పై లోతైన విచారణ



మధురవాడ ప్రాంతంలో రెవెన్యూ అధికారులు రికార్డులను ట్యాంపర్ చేసిన ప్రభుత్వ భూముల్లో ఇదొకటి

- ముడసర్లోవలో గల ప్రభుత్వ భూముల రికార్డులు కూడా మార్చినట్టు ఇప్పటికే గుర్తింపు
- రూరల్ మండలంలోని మరికొన్ని గ్రామాల్లోనూ అక్రమాలు
- అన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించాలని అధికారుల నిర్ణయం
- ఏడుగురికి నోటీసులు ఇవ్వడంతో రెవెన్యూలో కలకలం

విశాఖపట్నం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి):

విశాఖ రూరల్ మండలంలో ప్రభుత్వ భూములకు సంబంధించిన రికార్డుల ట్యాంపరింగ్ వ్యవహారంపై లోతైన విచారణ జరపాలని జిల్లా యంత్రాంగం నిర్ణయించింది. ప్రభుత్వానికి మధురవాడ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్లు 367, 368, 369లలో సుమారు 30 ఎకరాలు ఉన్నాయి. ఈ భూములకు సంబంధించిన రికార్డులు ట్యాంపర్ అయ్యాయి. ఈ వ్యవహారంలో అప్పట్లో (2004 నుంచి 2007 మధ్య) ఉన్న అధికారులు, సిబ్బందితో పాటు ఎవరెవరి పాత్ర ఉందో తేల్చనున్నారు. సుమారు రూ.1,000 కోట్ల విలువైన భూములు దోచుకునేందుకు రూరల్ మండలం, కలెక్టరేట్‌లో ఎఫ్-సెక్షన్ అధికారులు కలిసి పనిచేశారా?, వారి వెనుక ఉన్నతాధికారులు ఎవరైనా ఉన్నారా?...అన్న కోణంలో విచారణ చేయనున్నారు.

మధురవాడ, కొమ్మాది, పరదేశిపాలెంతో పాటు మిగిలిన గ్రామాల్లో గల ప్రభుత్వ భూముల రికార్డుల మార్పుపైనా అధికారులు దృష్టిసారించారు. ముడసర్లోవలోని కొన్ని సర్వే నంబర్లు ట్యాంపర్ అయిన విషయాన్ని అధికారులు గతంలో గుర్తించి, విచారణ చేపట్టారు. ఇంకా, ఈ విధంగా మండలంలో ఏఏ గ్రామాల్లో ప్రభుత్వ భూములకు సంబంధించిన రికార్డులు ట్యాంపర్ చేశారనేది క్షుణ్ణంగా పరిశీలించనున్నారు. తూతూ మంత్రంగా కాకుండా పక్కాగా విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని భావిస్తున్నారు.

మధురవాడ, కొమ్మాది, పరదేశిపాలెంలో ప్రభుత్వ భూముల రికార్డులను మార్చేసిన అంశంపై 2011లో తొలుత విచారణ ప్రారంభించారు. భూ పరిపాలన ముఖ్య కమిషనర్ ఆదేశాలతో రెండు పర్యాయాలు విచారణ జరిపి ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. దాని ఆధారంగా 2004 నుంచి 2007 వరకు రూరల్ మండలంలో పనిచేసిన తహసీల్దార్లు, సర్వేయర్లలో కొందరిపై శాఖాపరమైన చర్యలు తీసుకున్నారు. రికార్డులు ట్యాంపర్ చేయడంలో బాధ్యులుగా గుర్తించిన ఏడుగురు అధికారులు/ఉద్యోగులపై చర్యలు తీసుకోకుండా ఉన్నత స్థాయిలో కొందరు అడ్డుకున్నారు. డిప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతికి ఆటంకం కలగకుండా ఒకరిద్దరు ఎఫ్-సెక్షన్ సూపరింటెండెంట్లు ఉన్నతస్థాయిలో ఒత్తిడి తీసుకువచ్చారు. నగరంలో అత్యంత విలువైన భూములు ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేయడానికి ఉద్దేశపూర్వకంగా కోర్టుకు అఫిడవిట్ సమర్పించని అధికారికి ఉమ్మడి ఏపీలో, ఆ తరువాత వైసీపీ ప్రభుత్వంలో మంచి పలుకుబడి ఉంది. సదరు అధికారితోపాటు మిగిలిన

... మిగతా 6వ పేజీలో

ఉక్కుకు చిక్కులు తొలగేదెన్నడో!?

- నేడు వ్యవస్థాపక దినం
- ఉత్సవాలూ లేవు
- నెహ్రూ అవార్డులూ లేవు...
- రూ.వేల కోట్ల టర్నోవర్‌తో నడిచిన కర్మాగారం పరిస్థితి ప్రస్తుతం దయనీయం
- సక్రమంగా అందని జీతాలు
- కార్మికుల కంట కన్నీళ్లు



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఒకప్పుడు వేల కోట్ల రూపాయలు టర్నోవర్‌తో నడిచిన విశాఖపట్నం స్టీల్ ప్లాంటు ఇప్పుడు వ్యవస్థాపక దినోత్సవం కూడా నిర్వహించుకోలేని పరిస్థితికి వచ్చింది. అత్యంత కష్టకాలంలో...సామర్థ్యానికి మించి 110 శాతం ఉత్పత్తి సాధిస్తున్న కార్మికులు, ఉద్యోగులను భుజం తట్టి ప్రోత్సహించేందుకు కూడా వెనుకాడుతోంది. కర్మాగారం ఏర్పాటై మంగళవారం నాటికి 43 ఏళ్లు అవుతోంది. వ్యవస్థాపక దినోత్సవాన్ని గతంలో ఘనంగా నిర్వహించేవారు. హరిప్రసాద్ చౌరాసియా వంటి సంగీత విద్వాంసుల్ని రప్పించి కార్యక్రమాలు నిర్వహించేవారు. ఒక్కరోజు కూడా సెలవు పెట్టకుండా నిబద్ధతతో కష్టపడి పనిచేసే వారికి నెహ్రూ అవార్డులు ఇచ్చేవారు. ఇప్పుడు అవేవీ లేవు. గత నాలుగేళ్లుగా నామమాత్రంగా నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది ఏకంగా ఉత్సవాలనే రద్దు చేశారు. ఉక్కు కర్మాగారం కోసం నాడు రాష్ట్రవ్యాప్తంగా జరిగిన ఉద్యమంలో 32 మంది ప్రాణాలు కోల్పోయారు. ఎట్టకేలకు స్టీల్ ప్లాంటు నిర్మాణానికి 1972లో శంకుస్థాపన జరిగింది. 1986లో నిర్మాణ పనులు ఊపందుకున్నాయి. 1988 నుంచి ఒక్కొక్క విభాగం ప్రారంభమయ్యాయి. 1990 సంవత్సరానికి నిర్మాణం మొత్తం పూర్తయింది. 1992లో నాటి ప్రధాని పీవీ నరసింహరావు జాతికి అంకితం చేశారు.

నాలుగేళ్ల కిందట విశాఖపట్నం స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణ ప్రకటించే సమయానికి కర్మాగారం వేయి కోట్ల రూపాయల లాభంలో ఉంది. విస్తరణ, నిర్వహణ మూలధనం కోసం చేసిన అప్పులు 2021 నాటికి సుమారు రూ.20 వేల కోట్లు. అయితే ఉక్కు రంగాన్ని నాన్ స్ట్రాటజిక్ రంగంలో పెడుతున్నామని 2021లో ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్

... మిగతా 6వ పేజీలో



మేయర్‌పై అవిశ్వాసం?

- కూటమి ప్రజా ప్రతినిధుల భేటీలో చర్చ
- ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుతో చర్చించిన అనంతరం తుది నిర్ణయం
- ఎమ్మెల్సీ ఎన్నికల్లో రఘువర్మకు మద్దతుపైనా చర్చ

విశాఖపట్నం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి):

మహా విశాఖ నగర పాలక సంస్థ (జీవీఎంసీ) మేయర్ గొలగాని హరి వెంకటకుమారిపై అవిశ్వాసం పెట్టాలని కూటమి ప్రజా ప్రతినిధులు, నాయకులు భావిస్తున్నారు. వచ్చే నెల 18వ తేదీకి మేయర్ పదవీకాలం నాలుగేళ్లు పూర్తికానున్నది. ఆ తరువాత అవిశ్వాసం ప్రవేశపెట్టాలని యోచిస్తున్నారు. మేయర్‌పై అవిశ్వాసం, ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలపై చర్చించేందుకు కూటమి పార్టీల ప్రజా ప్రతినిధులు సోమవారం రాత్రి దసపల్లా హోటల్‌లో సమావేశమయ్యారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎంపీ ఎం.శ్రీభరత్, విప్ గణబాబు, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, పంచకర్ల రమేష్‌బాబు, వంశీకృష్ణ శ్రీనివాస్, విష్ణుకుమార్‌రాజు, ఏపీ అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీరావు, జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాస్, తదితరులు హాజరయ్యారు. మేయర్ పదవీకాలం నాలుగేళ్లు పూర్తయిన తరువాత అవిశ్వాసం ప్రవేశపెట్టేందుకు అవకాశం ఉందని, అందుకోసం ఇప్పటి నుంచే సన్నాహాలు చేయాలని కొందరు అభిప్రాయపడ్డారు. దీనిపై సీఎం చంద్రబాబునాయుడుతో చర్చించి, అనుమతి తీసుకోవాలని మరికొందరు సూచించారు. మేయర్ పదవిని జీవీఎంసీ పార్టీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాస్ ఆశిస్తున్నారు. ఇదే విషయమై అధినేతను పలుమార్లు

... మిగతా 6వ పేజీలో

క్రూయిజ్ టెర్మినల్ నిర్వహణకు టెండర్లు

మరోమారు ఆహ్వానించిన పోర్టు

- రెస్టారెంట్, గిఫ్ట్ షాపులు, చేతివృత్తుల కళాఖండాలు విక్రయించే షాపులు, ట్రావెల్ డెస్క్, బేకరీతో పాటు ప్రైవేటుగా బోటు జెట్టీకి కూడా అవకాశం ఇస్తామని ప్రకటన
- అధ్వానంగా టెర్మినల్ రహదారి
- దానిని బాగుచేస్తే తప్ప ఎవరూ వచ్చే పరిస్థితి లేదు



విశాఖపట్నం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి):

నగరంలో పర్యాటక అభివృద్ధి కోసం విశాఖపట్నం పోర్టు అథారిటీ రూ.100 కోట్లతో నిర్మించిన క్రూయిజ్ టెర్మినల్ నిర్వహణకు సమర్థుల కోసం ఎదురుచూస్తోంది. దీని నిర్మాణం పూర్తిచేసి ఏడాది దాటిపోయింది. క్రూయిజ్‌లు ఏమీ రాకపోవడంతో ఆ టెర్మినల్ అలాగే ఉంది. దేశీయ క్రూయిజ్‌లతో పాటు విదేశీ క్రూయిజ్‌లను రప్పించడానికి పర్యాటక శాఖ, టూర్స్ అండ్ ట్రావెల్స్ ప్రతినిధులతో కలిసి ప్రయత్నాలు చేస్తోంది.

టెర్మినల్ నిర్వహణలో పోర్టు అధికారులకు అనుభవం లేకపోవడంతో దానిని ఏదైనా ప్రైవేటు సంస్థకు లీజుకు ఇవ్వాలని నిర్ణయించి టెండర్లను ఆహ్వానించింది. దానికి పెద్దగా స్పందన రాలేదు. సమీప భవిష్యత్తులో క్రూయిజ్‌లు వచ్చే సూచనలు లేకపోవడంతో దానిని తీసుకోవడానికి ఎవరూ ముందుకు రాలేదు. ఇప్పుడు తాజాగా ఏపీ టూర్స్ అండ్ ట్రావెల్స్ అసోసియేషన్ జూన్‌లో కార్డెలియో సంస్థ ద్వారా మూడు ట్రిప్పులు ఓ క్రూయిజ్‌ని నడపడానికి ఒప్పించింది. అది వచ్చేలోపు ఇక్కడి పోర్టులోని క్రూయిజ్ టెర్మినల్‌లో పర్యాటకులకు అవసరమైన వసతులన్నీ సమకూర్చాలని పోర్టు అధికారులు నిర్ణయించారు. దీని కోసం తాజాగా సోమవారం టెండర్లు ఆహ్వానించారు. టెర్మినల్‌లో రెస్టారెంట్, గిఫ్ట్ షాపులు, చేతివృత్తుల కళాఖండాలు విక్రయించే షాపులు, ట్రావెల్ డెస్క్, బేకరీతో పాటు ప్రైవేటుగా బోటు జెట్టీకి

... మిగతా 6వ పేజీలో

అద్భుత కావ్య రచనలో
వాల్మీకి మహర్షి ఆద్యుడు

▸▸ ఆధ్యాత్మిక ప్రవచనకర్త 'చాగంటి'



చాగంటిని పూలమాలతో సత్కరిస్తున్న గాయత్రి విద్యాపరిషత్ కార్యదర్శి సోమరాజు

కొమ్మాది, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) :కావ్య రచనలో అనేక విషయాలను అత్యంత అద్భుతంగా వర్ణించడంలో వాల్మీకి మహర్షి ఆద్యుడని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త, బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు అన్నారు. కొమ్మాదిలోని గాయత్రి ఇంజనీరింగ్ మహిళా కళాశాల ఆవరణలో నిర్వహిస్తున్న సంపూర్ణ రామాయణ ప్రవచనాలలో భాగంగా కిష్కింధకాండలోని పలు విషయాలను సోమవారం ఆయన వివరించారు. చేయవలసిన పనిని చేయకుండా తరువాత ఎప్పుడో చేయడం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదని హనుమ చెప్పిన విధానాన్ని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో గాయత్రి విద్యాపరిషత్ కార్యదర్శి ఆచార్య సోమరాజు, అష్టలక్ష్మీదేవాలయం ధర్మకర్త అన్నంరాజు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పరిశీలన



పనులను తెలుసుకుంటున్న కార్పొరేటర్

సింహాచలం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ సాధారణ నిధులతో 98వ వార్డు పరిధిలో బీఆర్‌టీఎస్ ప్రధాన రోడ్డు నుంచి వరాహ పుష్కరిణి వరకు రోడ్డు అభివృద్ధి పనులు చేపడుతున్నారు. పుష్కరిణి రోడ్డులో జరుగుతున్న బీటీ రోడ్డు, ఫుట్‌పాత్ తదితర పనుల తీరును వార్డు కార్పొరేటర్ పీవీ నరసింహం సోమవారం పరిశీలించారు.

అప్పన్న ఆలయానికి పంచదార విరాళం

సింహాచలం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : అప్పన్న ఆలయంలో జరుగుతున్న పలు నివేదనలలో వినియోగించేందుకు పాలకొండ ప్రాంతంలోని షుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యం రెండు బస్తాల (50 కిలోల చొప్పున) పంచదారను విరాళంగా అందజేసింది. యాజమాన్యం ప్రతినిధులు సోమవారం ఉదయం ఆలయ ప్రధాన స్టోర్స్‌కు పంచదార బస్తాలను తూనిక వేసి అప్పగించారు.

అప్పన్న ఆలయ లీకుల నివారణకు శ్రీకారం

▸▸ పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే 'గంటా' ▸▸ పంచ గ్రామాల ఖాళీ స్థలాల క్రమబద్ధీకరణ అంశం పరిశీలిస్తున్నట్టు వెల్లడి

సింహాచలం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం సింహాచల వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయ పైకప్పు నుంచి వర్షపు నీరు కారడాన్ని నిరోధించే చర్యల్లో భాగంగా చేపట్టే ప్రాజెక్టు పనులకు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సోమవారం ప్రత్యేక పూజలు చేసి శ్రీకారం చుట్టారు. పూణేకు చెందిన లార్డు వెంకటేశ్వర రిలిజియస్ అండ్ చారిటబుల్ సంస్థ సుమారు రూ.నాలుగు కోట్ల నిధులను వెచ్చించి తొమ్మిది నెలల్లో పనులు పూర్తిచేసేందుకు నాలుగురోజుల క్రితం ఎంఓయూ కుదుర్చుకుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయ బేడా మండపం, పోటు, కల్యాణ మండపం మొత్తం సుమారు 11వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో మరమ్మతు పనులు చేపట్టవలసి ఉందన్నారు. ఇందుకు అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. పనులు పూర్తయిన అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, దేవదాయ శాఖ మంత్రి ఆనం రామ్‌నారాయణ రెడ్డిలను సింహాచలం ఆహ్వానిస్తామన్నారు. అలాగే, పంచగ్రామాల భూ వివాద పరిష్కార చర్యల్లో భాగంగా ఖాళీ స్థలాల క్రమబద్ధీకరణ, రైతుల హక్కుల వంటి అంశాల పరిష్కారానికి కృషి చేస్తామని గంటా హామీ ఇచ్చారు. సాధ్యమైనంత త్వరగా భూ సమస్యకు ముగింపు పలికేందుకు ముఖ్యమంత్రి చిత్తశుద్ధితో ఉన్నారన్నారు. అదే విధంగా 98వ వార్డు పరిధిలోని బీఆర్‌టీఎస్ సింహాచలం కారిడార్ పనుల సందర్భంగా ఎదురైన టీడీఆర్‌లు తదితర సమస్యలను కూడా త్వరలో పరిష్కారిస్తామని వివరించారు. అనంతరం సింహాద్రినాథుని దర్శనం చేసుకున్న ఆయనకు ఆలయ అధికారులు సాదరంగా ఆహ్వానం పలికారు. 98వ వార్డు కార్పొరేటర్ పీవీ నరసింహం, టీడీపీ వార్డు అధ్యక్షుడు పంచదార్ల శ్రీనివాస్, నేతలు గుసిడి శంకరరావు, బంటుబిల్లి మహేష్, సిరిపురపు సురేష్, రాజనాల సత్యారావు, గుసిడి అవినాష్‌బాబు పాల్గొన్నారు.



పనుల ప్రారంభోత్సవం సందర్భంగా పూజ చేస్తున్న ఎమ్మెల్యే గంటా

పీఎఫ్ సమస్య యాజమాన్యం సమక్షంలోనే పరిష్కారం

▸▸ జూట్ కార్మిక నాయకులకు పీఎఫ్ రీజనల్ కమిషనర్ స్పష్టీకరణ



రీజనల్ కమిషనర్‌కు వినతిని అందిస్తున్న దృశ్యం

తగరపువలస, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : చిట్టివలస జూట్‌మిల్లు 2009లో లాకౌట్ విధించిన తర్వాత పెండింగ్‌లో ఉన్న కార్మికుల పీఎఫ్ సమస్య యాజమాన్యం సమక్షంలోనే పరిష్కారం అవుతుందని, వారు లేకుండా తానేమీ చెప్పలేనని పీఎఫ్ రీజినల్ కమిషనర్ పవన్ జాన్సి స్పష్టం చేశారు. కార్మిక సంఘాల నాయకులు సోమవారం 'చలో పీఎఫ్ కమిషనర్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రీజనల్ కమిషనర్‌ను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. దీనిపై ఆయన మాట్లాడుతూ చాలామంది కార్మికుల పేర్లు మారిపోయి ఉన్నాయని, వారి ఆధార్ కార్డులలో తేడాలు కూడా ఉన్నాయని వివరించారు. వీటి విషయంలో యాజమాన్యం, కార్మిక సంఘాలు ఉమ్మడిగా నిర్ణయం తీసుకుని తమకు లేఖ అందిస్తే వారి పేరుతో ఉన్న సొమ్మును చెల్లించడానికి అవకాశం ఉంటుం దని వివరించారు. అన్నీ సక్రమంగా ఉన్న వారికి కూడా పీఎఫ్ చాలా కాలంగా అందడం లేదని కార్మిక నాయకులు తెలియజేయగా, యాజ మాన్యం సరైన పత్రాలు అందిస్తేనే తాము చెల్లించగలమని పవన్ తెలిపారు. కాగా, ప్రధానమైన మారుపేరు సమస్య గురించి కాంగ్రెస్ కార్మిక సంఘ అధ్యక్షుడు దల్లి అప్పలరెడ్డి వివరణ ఇస్తూ మిల్లు పనిచేసిన సమయంలో పనిచేస్తున్న కార్మికులు చనిపోయినా, అనారోగ్యానికి గురైన వారి కొడుకు లేదా అల్లుడికి ఉద్యోగ అవకాశాన్ని కల్పించేవారన్నారు. అలా లేనివారు ఇతరులకు ఈ అవకాశం ఇచ్చారని ఆనాడు యాజమాన్యం అంగీకరించిందని తెలియజేశారు.

మిల్లు లాకౌట్ జరిగిన 2009లో ఆధార్ కార్డులు లేనందువల్ల ఈ మార్పుతో ఇబ్బంది ఉండేదని కాదన్నారు. కానీ ఇప్పుడు ఆధార్ కార్డులు రావడం వల్ల ఇంటి పేర్లు మారిపోయి, వ్యక్తులు మారిపోయి వాస్తవంగా మిల్లులో పనిచేసిన వారికి కూడా పరిహారాలు రాని పరిస్థితి ఏర్పడిందని తెలియజేశారు.

మారుపేరుతో పనిచేసిన కార్మికునికి ప్రస్తుతానికి అతనికి ఉన్న ఆధార్‌కార్డు, మిల్లులో పనిచేసినట్లు ధ్రువీకరణ ఆధారంగా అతనికి చెల్లించవలసిన పీఎఫ్ సొమ్మును చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. పరిహారాలు రాని అనేక మంది కార్మికులు చనిపోయారని, వారి వారసులు కూడా ఈసొమ్ము కోసం ఎదురు చూస్తున్నారని పేర్కొన్నారు. ఈ వినతి పత్రంలో అప్పలరెడ్డి, ఆదినారాయణ, ఏఐటీయూసీకి చెందిన కె.రాంబాబు, ఎంఏ రాజు తదితరులు సంతకాలు చేశారు.

గీతం ఎంబీఏ విద్యార్థుల కోసం 'ఐసీఐపీ'



సమావేశంలో మాట్లాడుతున్న గీతం స్కూల్ ఆఫ్ డీన్

సాగర్‌నగర్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ బిజినెస్ ద్వారా ఎంబీఏ కోర్సు అభ్యసిస్తున్న విద్యార్థులకు జాతీయ, అంతర్జాతీయ పరిశ్రమలు ఎదుర్కొంటున్న సవాళ్లను అధ్యయనం చేయడం, పరిష్కారాలు కనుగొనడంపై శిక్షణ ఇచ్చేందుకు యూఎస్‌ఏ, యూకేలోని ప్రముఖ విశ్వవిద్యాలయాలతో అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకుంది. దీనికి సంబంధించిన విశ్వవిద్యాలయాల నిపుణులతో సోమవారం సమావేశాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా గీతం స్కూల్ ఆఫ్ డీన్ ప్రొఫెసర్ రాజా ఫణిపప్పు మాట్లాడుతూ ఈ భాగస్వామ్య ఒప్పందం ద్వారా అంతర్జాతీయ బంధాలు బలోపేతమవుతాయన్నారు. గీతంలో ఎంబీఏ అభ్యసించే విద్యార్థులు ఐసీఐపీ కార్యక్రమంలో భాగంగా అమెరికా, యూకేలలోని భాగస్వామ్య విశ్వవిద్యాలయాలకు వెళ్లి తొమ్మిది నెలల పాటు వివిధ అంశాలపై అధ్యయనం చేస్తారని వివరించారు. ఈ సమావేశంలో గీతం అసోసియేట్ డీన్ డాక్టర్ వై.రాధిక, డాక్టర్ సాయిసుధాకర్, ఎంబీఏ బోర్డు ఆఫ్ స్టడీస్ కో-చైర్మన్ డాక్టర్ డి.విజయగీత, ఎంబీఏ కోర్సు చైర్మన్ డాక్టర్ సుబ్రహ్మణ్యం, గీతం ఆర్‌డీసీ డిప్యూటీ డైరెక్టర్ వి.గణపతిలతో పాటు అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ నార్త్ కరోలినా విల్మింగ్‌టన్ ప్రతినిధులు డాక్టర్ క్రిస్ ఫినెల్లి, డాక్టర్ నివైన్‌రిచి, డాక్టర్ మనోజ్ వనజాకుమారి, జెర్రిబెంటన్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దాస్పత్రిలో ఇమ్యునోగ్లోబులిన్స్
ఇంజెక్షన్ల కొరత

... 5వ పేజీ తరువాయి

రూ.15 వేలు ఉంటే...అందులో ఐదు గ్రాముల వరకూ మాత్రమే ఉంటుంది. అంటే, రోగికి ప్రతిరోజూ కనీసం ఐదు నుంచి ఏడు వరకు ఇంజెక్షన్లు చేయాల్సి ఉంటుంది. తక్కువలో తక్కువ రోజుకు కనీసం లక్ష రూపాయలు ఖర్చు అవుతుంది. అయితే కేజీహెచ్‌కు గడిచిన కొన్ని రోజులు నుంచి ఈ ఇంజెక్షన్ల సరఫరా ఆశించిన స్థాయిలో లేదని చెబుతున్నారు. ఉన్న ఇంజెక్షన్లను కూడా రోగులకు ఇవ్వడం లేదని పేర్కొంటున్నారు. రోజుకు ఒక్కో రోగికి ఐదు నుంచి ఏడు వరకు ఇంజెక్షన్లు అవసరం ఉంటే...ఒక్కటి కూడా ఇవ్వడం లేదు. ఈ వ్యాధి బారినపడి సోమవారం చనిపోయిన మహిళకు 11 రోజుల వ్యవధిలో సుమారు పది వరకు ఇంజెక్షన్లు చేయగా, వాటిలో రెండు మాత్రమే కేజీహెచ్ నుంచి ఇచ్చినట్టు చెబుతున్నారు.

మిగిలినవి కుటుంబసభ్యులు బయట కొనుగోలు చేసుకున్నట్టు తెలిసింది. దీనిపై ఆస్పత్రి అధికారులు మాత్రం మాట్లాడడం లేదు. ఆస్పత్రి అధికారులు ఈ మరణాన్ని కూడా జీబీఎస్‌గా నిర్ధారించడం లేదు. గుండెపోటుతో మరణించినట్టు ప్రకటించడం గమనార్హం. ఇదిలావుంటే ఈ మరణాన్ని నిర్ధారించే విషయంలో ఆస్పత్రిలో పెద్ద వివాదమే జరిగినట్టు తెలుస్తోంది. మహిళ మృతి చెందిన వెంటనే జనరల్ మెడిసిన్ విభాగానికి చెందిన వైద్యులు జీబీఎస్‌గా పేర్కొనగా...ఉన్నతాధికారులు నుంచి వచ్చిన ఒత్తిడితో దీన్ని మార్చే ప్రయత్నం జరిగినట్టు ప్రచారం జరుగుతోంది.

ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి

ఆనందపురం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలను అందరూ విధిగా పాటించాలని ట్రాఫిక్ డివిజన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సాయి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని శొంఠ్యాం సమీపంలోని ఎన్ఎస్ఆర్ఐటీ ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులందరూ ట్రాఫిక్ నియమాలను పాటిస్తూ పోలీసులకు సహకరించాలని కోరారు. తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ లక్ష్య సాధనతో ముందుకు సాగుతూ ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.శంభుప్రసాద్, సీఐ చింతా వాసునాయుడు, ఎస్ఐ పాపారావు, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ వర్కర్ల ఆందోళన

▸▸ వేతనాలను పెంచడంతో పాటు ఇతర హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయాలి

▸▸ సీఐటీయూ జిల్లా నాయకురాలు మణి డిమాండ్



ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీలు

భీమునిపట్నం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ వర్కర్ల వేతనాల పెంపుదలపై కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఇక్కడి కృష్ణా కాలనీలో ఉన్న ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద అంగన్‌వాడీ కార్మికులు ఆందోళన నిర్వహించారు.

ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకురాలు మణి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో అంగన్‌వాడీలు పోరాటాలద్వారా సాధించుకున్న హామీలను కూడా ప్రస్తుత ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుని పరిశీలించాలన్నారు. 2019 నుంచి అంగన్‌వాడీలకు వేతనాలను పెంచకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు చేయాలని, గ్రాట్యుటీ అమలు చేయాలని, మినీ అంగన్‌వాడీ కేంద్రాలను ప్రధాన కేంద్రాలుగా మార్చాలని డిమాండ్ చేశారు. సాధికారత సర్వేలో ప్రభుత్వ ఉద్యోగులనే పదాన్ని తొలగించాలని, సంక్షేమ పథకాలన్నీ అంగన్‌వాడీలకు వర్తింపజేయాలని కోరారు. ప్రీ స్కూల్ బలోపేతం చేయాలని, ప్రీ స్కూల్ చిన్నారులకు సాయంత్రం వేళల్లో స్నాక్స్ అందించాలన్నారు. తమ సమస్యలను పరిష్కరించాలంటూ అంగన్‌వాడీలు పెద్దఎత్తున నినాదాలు చేశారు. అనంతరం ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి ఎం.శ్రీదేవికి యూనియన్ ప్రతినిధులు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో భీమిలి ప్రాజెక్టు గౌరవాధ్యక్షురాలు ఆర్.వెంకటలక్ష్మి, అధ్యక్షురాలు ఎం.శ్రీదేవి, ప్రతినిధులు కె.లక్ష్మి, కె.పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రాధాకృష్ణుల విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ



రాధాకృష్ణుల విగ్రహాల వద్ద పూజలు, యాగం చేస్తున్న అర్చకులు

ఆనందపురం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంభీరంలో ఉన్న హరేకృష్ణ వైకుంఠం మందిరంలో సోమవారం రాధాకృష్ణుల విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం భక్తుల సమక్షంలో యాగం నిర్వహించి వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ విశ్వగురువు వేదాంత స్వామి చేతుల మీదుగా విగ్రహ ప్రాణ ప్రతిష్ఠను జరిపారు. అనంతరం ప్రతిష్ఠించిన విగ్రహాలకు గ్లోబల్ హరేకృష్ణ మూవ్‌మెంట్ చైర్మన్ రాధా మదన్‌మోహన్‌స్వామి, బెంగళూరు ఇస్కాన్ టెంపుల్ ప్రెసిడెంట్ పద్మశ్రీ మధు పండితదాస నామకరణం చేసి గుడి విశిష్టతను భక్తులకు వివరించారు. సాయంత్రం పలు పవిత్ర నదుల నుంచి సేకరించిన 108 జల కలశాలతో కుంభాభిషేకం చేశారు. అనంతరం వివిధ రకాల పండ్ల రసాలు, పంచామృతం, పంచగవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆంధ్ర తెలంగాణ అధ్యక్షుడు సత్యగౌర చంద్రదాస, ఇస్కాన్ సభ్యులు వాసుదేవ కేశవ ప్రభు, నిష్కించిన భక్తదాస, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కేజీబీవీ విద్యార్థినులకు న్యూమరసీ పరీక్ష



పరీక్ష రాస్తున్న విద్యార్థినులు

భీమునిపట్నం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినుల అభ్యసన పురోగతిని అంచనా వేయడానికి సోమవారం భీమిలి కస్తూర్బాగాంధీ విద్యాలయం విద్యార్థినులకు ఫౌండేషన్ న్యూమరసీ పరీక్ష నిర్వహించారు. రాష్ట్ర సమగ్రశిక్ష కేజీబీవీ కార్యదర్శి డి. దేవానందరెడ్డి ఆదేశాల మేరకు 6, 8 తరగతుల విద్యార్థినులకు తెలుగు, ఆంగ్లం, గణితం, సబ్జెక్టులలో పరీక్ష నిర్వహించారు. జిల్లా గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ కలీషా బేగం పర్యవేక్షణలో విద్యార్థినులకు మౌఖిక, రాత పరీక్షలు నిర్వహించారు. వీటి ఫలితాల ఆధారంగా విద్యార్థినుల అభ్యసనపై విద్యాలయం ఉపాధ్యాయులతో ఆమె చర్చించారు. అనంతరం పాల్ ల్యాబ్ తరగతి గదిని, విద్యాలయం పరిసరాలు, రికార్డులు, స్టోర్ రూమ్‌ను పరిశీలించారు. పబ్లిక్ పరీక్షలకు సిద్ధమవుతున్న టెన్త్, ఇంటర్ విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపి వారు మంచి ఫలితాలను సాధించేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జి.కుమారి, తదితరులు పాల్గొన్నారు.

గాదె శ్రీనివాసులనాయుడుకు మద్దతుగా పీఆర్‌టీయూ ప్రచారం

తగరపువలస, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న గాదె శ్రీనివాసుల నాయుడుకు మద్దతుగా తగరపువలసలో సోమవారం రాత్రి పీఆర్‌ఆర్‌టీయూ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఓటర్ల ఇంటింటికీ వెళ్లి గాదె శ్రీనివాసుల నాయుడుకు మొదటి ప్రాధాన్యం ఓటు వేసి గెలిపించవలసిందిగా విజ్ఞప్తి చేశారు. గాదె గెలుపు కోసం అందరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మురళీమోహన్, ఉదయ్‌కుమార్, పరదేశి, తదితరులు పాల్గొన్నారు.

జీబీఎస్ కలకలం

... 5వ పేజీ తరువాయి

చెబుతున్నారు. ఈ విధానంలో భాగంగా మైలిన్ పొరను డ్యామేజ్ చేసే యాంటీబాడీస్‌ను తొలగిస్తారు. తద్వారా రోగి వేగంగా కోలుకునేలా చేస్తారు. అయితే, ఈ విధానంలో బీపీ తగ్గడం, ఇన్‌ఫెక్షన్లు రావడం వంటి ఇబ్బందులు ఉంటాయి. కొందరు రోగులకు ఇంజెక్షన్లు ఇవ్వడంతోపాటు ఈ విధానంలో కూడా చికిత్స అందించాల్సి ఉంటుంది.

వ్యాధి నిరోధక శక్తి పెంపుతో వ్యాధికి అడ్డుకట్ట



ఈ వ్యాధి ఎవరికైనా రావచ్చు. వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్న వారిపై దీని ప్రభావం అధికంగా ఉంటుంది. కాబట్టి, వ్యాధి నిరోధక శక్తిని పెంచుకునే మార్గాలపై దృష్టిసారించాలి. అతిగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. వైరస్, బాక్టీరియా బారినపడి కోలుకున్న తరువాత ఈ వ్యాధికి సంబంధించిన లక్షణాలు కనిపిస్తే మాత్రం అప్రమత్తం కావాలి. ఆ తరహా లక్షణా లన్నీ జీబీఎస్ కాకపోవచ్చు. కొన్నిసార్లు ఇతర కారణాలతో ఇటువంటి లక్షణాలు కనిపిస్తుంటాయి. నెర్వ్ కండక్షన్ స్టడీ నిర్వహించి నిర్ధారిస్తాం. బయట ఐదు వేలు విలువజేసే ఈ పరీక్షను ప్రతిరోజూ పది మందికి ఉచితంగా కేజీహెచ్‌లో నిర్వహిస్తున్నాం.

- డాక్టర్ ఎస్.గోపి, న్యూరాలజీ విభాగాధిపతి, కేజీహెచ్

మేయర్‌పై అవిశ్వాసం?

... 5వ పేజీ తరువాయి

కలిశారు. కాగా ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎన్నికల్లో సిట్టింగ్ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మకు మద్దతుపై కూడా సమావేశంలో చర్చించారు. ఈ విషయాన్ని పట్టభద్ర ఎమ్మెల్సీ చిరంజీవిరావు ప్రస్తావించారు. 2023లో జరిగిన ఉత్తరాంధ్ర పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి వేపాడ చిరంజీవిరావుకు రఘువర్మ మద్దతు పలికారు. అప్పటి నుంచి టీడీపీలో పలువురు నేతలతో రఘువర్మకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. ప్రధానంగా రఘువర్మ నామినేషన్‌కు చిరంజీవిరావు హాజరుకావడంతోపాటు ప్రచారం చేస్తున్నారు. రఘువర్మకు మద్దతు గురించి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో చర్చించిన తరువాతే ఒక నిర్ణయానికి రావాలని ఎమ్మెల్యేలు నిర్ణయించారు. ఈ సమావేశానికి పార్లమెంటరీ నియోజకవర్గ పార్టీ అధ్యక్షుడు గండి బాబ్జీకి ఆహ్వానం లేదు. అయితే ఎంపీ శ్రీభరత్‌ను కలిసేందుకు దసపల్లా హోటల్‌కు వెళ్లిన బాబ్జీని పీలా గోవింద, పీలా శ్రీనివాస్‌లు సమావేశానికి తీసుకువెళ్లారు. ఆయన కొద్దిసేపు ఉండి ఎంపీతో పాటు బయటకు వచ్చేశారు.

ఉక్కుకు చిక్కులు తొలగేదెన్నడో!?

... 5వ పేజీ తరువాయి

ప్రకటించారు. అప్పటి నుంచి విశాఖ ప్లాంటుకు కష్టాలు మొదలయ్యాయి. ఎటువంటి సహాయం అందకపోవడంతో పీకల్లోతు నష్టాల్లోకి వెళ్లింది. అప్పులు రూ.35 వేల కోట్లకు చేరాయి. ముడి పదార్థాలు కరవయ్యాయి. కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు తెర వెనుక ప్రయత్నాలు జరిగాయి. ఇక్కడ విశాఖ ఉక్కు పరిరక్షణ ఉద్యమం మొదలైంది. అయితే గతంలో ఏ ప్రభుత్వమూ చేయని విధంగా కూటమి నేతల ఒత్తిడి వల్ల కేంద్ర ప్రభుత్వం ఇటీవల రూ.11,440 కోట్ల సాయం ప్రకటించింది. అయితే సొంత ఐరన్‌ఓర్ గనులు లేకపోవడం పెద్ద సమస్యగా మారింది. ఉత్పత్తి వ్యయం ఇతర ప్లాంట్ల కంటే ఎక్కువగా ఉంది. ఉక్కు కర్మాగారానికి మానవ వనరులే కీలకం. యాజమాన్యం సానుకూల వైఖరి వల్ల గతంలో ఉద్యోగులు కష్టపడి 15 ఏళ్లు వరుసగా లాభాలలో నడిపించారు. వేతన ఒప్పందం తరువాత ఉద్యోగులకు ఇవ్వాల్సిన బకాయిలను పెండింగ్‌లో పెట్టేశారు. ప్రస్తుత యాజమాన్యం ఉద్యోగులపై వివక్ష చూపుతూ పాత వేతనాల్లో రకరకాల పేర్లతో 25 శాతం కోత విధించింది. ఆ మిగిలిన జీతాలు కూడా నెల నెలా ఇవ్వడం లేదు. మరో వైపు ఉద్యోగుల సంఖ్య తగ్గించుకుంటూ వస్తున్నారు. వాస్తవానికి 73 లక్షల టన్నుల ఉత్పత్తికి కొత్తగా ఐదు వేల మంది ఉద్యోగులు కావాలి. రిక్రూట్‌మెంట్ మొదలుపెడితే నిర్వాసితులకు 2,500 ఉద్యోగాలు వస్తాయి. కానీ అవేమీ చేయకుండా ఉన్నవారిలో 1,200 మందికి వీఆర్ఎస్ ఇచ్చి పంపించేందుకు ఏర్పాట్లు చేశారు. కాంట్రాక్టు కార్మికులను 30 శాతం తగ్గించడానికి కుట్ర జరుగుతోంది.

తలకు మించిన భారమే

ఆర్థిక ప్యాకేజీ ఇచ్చిన ఉక్కు శాఖా మంత్రి కుమారస్వామి ఇక్కడకు వచ్చినప్పుడు...'కేంద్ర సాయంతో మూడు బ్లాస్ట్ ఫర్నేస్‌లు నడుపుకొని మీ జీతాలు మీరు తీసుకోండి' అని ప్రకటించారు. సొంత గనులు లేకుండా, వేల కోట్ల రూపాయల అప్పులు తీర్చకుండా నెల నెలా వందల కోట్ల రూపాయల వడ్డీలు చెల్లిస్తూ, 73 లక్షల టన్నుల ఉత్పత్తికి అవసరమైన వేలాది కోట్ల విలువైన ముడి పదార్థాలను సమకూర్చుకోవడం యాజమాన్యానికి తలకు మించిన భారం. గత ఐదు నెలలుగా సంస్థకు శాశ్వత చైర్మన్ లేరు. వేరొకరిని డిప్యుటేషన్‌పై తీసుకువచ్చి నియమించారు. ప్లాంటు ఆపరేషన్ వ్యవహారాలు పర్యవేక్షించే డైరెక్టర్ లేరు. ఇండిపెండెంట్ డైరెక్టర్ పోస్టులు మూడు ఖాళీగా ఉన్నాయి. ఎవరినీ నియమించకుండా, ఉన్న వారిని తీసేసి, తగ్గించి, అవసరమైన ముడి పదార్థాలు అందించకుండా ప్లాంటును పట్టాలపైకి తేవడం చాలా కష్టం. రెండు బ్లాస్ట్ ఫర్నేస్‌లకే ముడి పదార్థాల సరఫరా అరకొరగా ఉంది. ఇక మూడోది ప్రారంభిస్తే ఎక్కడి నుంచి సమకూర్చుకుంటారో చెప్పడం లేదు. అన్నీ ఇచ్చినా ప్లాంటును పైకి తీసుకురాలేకపోయారని ముద్ర వేయడానికి ఇదంతా చేస్తున్నారనే ఉద్యోగ, కార్మిక వర్గాలు అనుమానిస్తున్నాయి. దీనిపై కేంద్రం, ఎంపీలు, దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.

రికార్డుల ట్యాంపరింగ్‌పై లోతైన విచారణ

... 5వ పేజీ తరువాయి

వారంతా ఉన్నత స్థాయిలో ఒత్తిడి తీసుకువచ్చి చర్యలు తీసుకోకుండా పైరవీలు చేశారు.

ఇదిలావుండగా మధురవాడ సర్వే నంబర్లు 367, 368, 369, 370లో ప్రభుత్వ రికార్డులు ట్యాంపర్ వ్యవహారంపై విచారణ చేయాలని 2023లో అప్పటి రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ ఇచ్చిన ఆదేశాలకు లోబడి జేసీకి విచారణ బాధ్యతలు అప్పగిస్తూ గత ఏడాది సీసీఎల్ఏ ఉత్తర్వులు ఇచ్చారు. ఈ మేరకు తాజాగా ఏడుగురు (అప్పటి 'ఎఫ్' సెక్షన్ సూపరింటెండెంట్లుగా పనిచేసి ప్రస్తుతం పలుచోట్ల డిప్యూటీ కలెక్టర్లుగా పనిచేస్తున్న పి.ధర్మచంద్రారెడ్డి (ప్రస్తుతం పార్వతీపురం మన్యం జిల్లా కేఆర్ఆర్‌సీ ఎస్‌డీసీ), ఎస్‌డీ అనిత (విశాఖ జిల్లా ఏపీఐఐసీ ఎస్‌డీసీ), డి.ప్రమీలాగాంధీ (బొబ్బిలిలో భూసేకరణ ఎస్‌డీసీ), కె.సుబ్బారావు (కాకినాడలో దేవదాయ శాఖ ప్రాంతీయ కమిషనర్), అప్పట్లో 'ఎఫ్' సెక్షన్‌లో టైపిస్టుగా చేసిన బి.రవికుమార్ (పాడేరులో గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ తహసీల్దారు), ఆర్వీ మురళీధర్ (అనకాపల్లి జిల్లా బుచ్చెయ్యపేట తహసీల్దారు కార్యాలయంలో డీటీ), జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేసిన కె.విజయభాస్కర్ (విశాఖలోని పెదగంట్యాడ తహసీల్దారు కార్యాలయం డీటీ)) అధికారులు ఈ నెల 22వ తేదీ ఉదయం 10.30 గంటలకు విశాఖపట్నం జాయింట్ కలెక్టర్ ఎదుట విచారణకు హాజరుకావాలని నోటీసులు జారీచేయడం రెవెన్యూ వర్గాల్లో కలకలం రేపింది.

షేమ్ సీన్

... 5వ పేజీ తరువాయి

బకాయిలు చెల్లించేస్తారు కాబట్టి సీల్ తొలగించాలని ఆదేశించారు. జోన్-4 అధికారులు చేసేదేమీ లేక సీల్‌ను తొలగించేశారు. తాజాగా వేమన మందిరం లీజుకు ఇచ్చి 25 దాటిపోయింది కాబట్టి, వేలం వేస్తే జీవీఎంసీకి నెలకు కనీసం రూ.రెండు లక్షల ఆదాయం వస్తుందని, ఏపీ మునిసిపల్ యాక్ట్ ప్రకారం ఆ మందిరాన్ని స్వాధీనం చేసుకోవాలంటూ జనసేనకు చెందిన ఒక కార్పొరేటర్ జీవీఎంసీ అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో వారం రోజుల్లోగా ఖాళీ చేయాలని, లేనిపక్షంలో తామే సీల్ వేసి స్వాధీనం చేసుకుంటామని పేర్కొంటూ జోన్-4 అధికారులు నోటీసులు జారీ చేశారు. నోటీసులో పేర్కొన్న గడువు శనివారం నాటికి ముగియడంతో సోమవారం ఉదయాన్నే జోన్-4 అధికారులు వేమన మందిరానికి సీల్ వేసి స్వాధీనం చేసుకున్నారు.

ప్రజా ప్రతినిధుల రంగ ప్రవేశంతో కంగుతిన్న అధికారులు

వేమన మందిరానికి సీల్ వేసిన కొద్దిసేపటికే కూటమికి చెందిన ముగ్గురు ప్రజా ప్రతినిధులు ఒకరి తర్వాత ఒకరు అన్నట్టు జోన్-4 అధికారులకు ఫోన్ చేసి 'వేమన మందిరానికి ఎందుకు సీల్ వేశారు? తక్షణం తొలగించి నిర్వాహకులకు అప్పగించండి.' అంటూ హుకుం జారీచేయడంతో అధికారులు అవాక్కయ్యారు. లీజు కాలపరిమితి 25 ఏళ్లు దాటి సుమారు దశాబ్దం గడుస్తోందని, గతంలో లీజులో దక్కించుకున్న వ్యక్తి కూడా ప్రస్తుతం జీవించి ఉన్నట్టు సమాచారం లేదని అధికారులు వారికి వివరించారు. మునిసిపల్ చట్టం ప్రకారం 25 ఏళ్లకు మించి లీజుకిచ్చే అవకాశం లేదు కాబట్టి తాము చేయగలిగిందేమీ లేదని ప్రజా ప్రతినిధులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. దీంతో ముగ్గురు ప్రజా ప్రతినిధులు నేరుగా ఇన్‌చార్జి కమిషనర్‌గా వ్యవహరిస్తున్న జిల్లా కలెక్టర్‌కే ఫోన్ చేసి ఒత్తిడి చేయడంతో జోన్-4 అధికారులు సీల్ తొలగించాల్సి వచ్చిందని అధికార వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. చిత్తశుద్ధితో పనిచేసే వారిని ప్రోత్సహించాల్సిన ప్రజా ప్రతినిధులు...అందుకు విరుద్ధంగా, జీవీఎంసీ ఆదాయానికి గండి కొట్టేలా వ్యవహరించడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.

క్రూయిజ్ టెర్మినల్ నిర్వహణకు టెండర్లు

... 5వ పేజీ తరువాయి

కూడా అవకాశం ఇస్తామని ప్రకటించారు. దీనికి 11 నెలల లీజు పరిమితి ఉంటుందని, ఆసక్తి కలిగిన సంస్థలు ముందుకురావాలని కోరారు.

ఆ మార్గం బాగుపడితే తప్ప ఎవరూ రారు : పోర్టు అధికారులు క్రూయిజ్ టెర్మినల్‌ను పోర్టు ఆవరణలో నిర్మించారు. దీనికి వెళ్లే మార్గం చాలా దారుణంగా, అపరిశుభ్రంగా ఉంటుంది. అది ఇతరులు సంచరించడానికి అనుమతి కూడా లేని ప్రాంతం కావడం గమనార్హం. ఒంటరిగా అటు వైపు ఎవరైనా వెళితే ఏ దారుణమైనా జరిగే ప్రమాదం లేకపోలేదు. గతంలో పర్యాటక శాఖ అధికారులతో పోర్టు నిర్వహించిన సమావేశంలో ఇదే సమస్య చర్చకు వచ్చింది. టెర్మినల్‌కు వెళ్లే మార్గాన్ని అందంగా తీర్చిదిద్దాలని సూచించారు. అయితే దీనిపై అధికారులు దృష్టి సారించలేదు. క్రూయిజ్‌లో వచ్చే పర్యాటకులు విశాఖ నగరాన్ని చూడాలనుకుంటారు. వారు క్రూయిజ్ నుంచి దిగగానే ఆ దుర్గంధభరితమైన మార్గంలో నగరంలోకి వస్తే ఎంత వేగంగా వెనక్కి వెళ్లిపోదామా? అనే అభిప్రాయం కలుగుతుంది. పోర్టు అధికారులు ముందు ఆ మార్గాన్ని ఆకర్షణీయంగా తయారు చేయాల్సిన అవసరం ఉంది. అప్పుడే ఒక్కొక్కటిగా సమస్యలు పరిష్కారం అవుతాయి. వ్యాపారులూ అక్కడ కార్యకలాపాల నిర్వహణకు ముందుకువస్తారు. ఆ దిశగా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

రోగి మృతితో ఆస్పత్రి ఎదుట బంధువుల ఆందోళన


ఆస్పత్రి వద్ద ఆందోళన చేస్తున్న దృశ్యం

ఆరిలోవ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న చోడవరం సమీపంలోని రెల్ల గ్రామానికి చెందిన శ్రీధర్‌ను బంధువులు ఆదివారం కేర్ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్సకు రూ.1.7 లక్షలు చెల్లించారు. చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. శస్త్రచికిత్స విఫలం కావడంతోనే మృతిచెందాడని రోగి బంధువులు ఆరోపించారు. రూ.5 లక్షలు చెల్లిస్తేనే మృతదేహాన్ని అప్పగిస్తామని ఆస్పత్రి వర్గాల వారు డిమాండ్ చేస్తున్నారని ఆందోళన చేశారు. చివరకు ఆరిలోవ సీఐకు ఫిర్యాదు చేయడంతో ఆయన సంప్రదింపులు చేసిన అనంతరం మృతదేహాన్ని రోగి బంధువులకు అప్పగించారు. దీంతో ఆందోళన సద్దుమణిగింది.

దోమల నివారణకు చర్యలు


యంత్రంతో ఫాగింగ్ చేస్తున్న సిబ్బంది

మద్దిలపాలెం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ జోన్-3 పరిధిలో దోమల నివారణ చర్యలు చేపట్టారు. జోన్-3లో దోమల బెడద శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. పలు ప్రాంతాల్లో సోమవారం సాయంత్రం చేతి యంత్రాలతో పొగకొట్టారు. మెగా యంత్రంతో ఆటోలో ఫాగింగ్ చేశారు. వార్డుల్లోని మురికివాడలు, మురుగు కాల్వలు, నీటి నిల్వల వద్ద దోమల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని జీవీఎంసీ బయాలజిస్టు డి.సాంబమూర్తి తెలిపారు.

23న రక్తదాన శిబిరం

విశాఖపట్నం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 23న జిల్లా బాడీ లిఫ్టింగ్ సంఘం కార్యనిర్వహణ కార్యదర్శి కెచిరం జీవి స్మారక రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నట్టు ఏపీ బాడీ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రధాన కార్య దర్శి కిలాని గణేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. రామాటాకీస్ ఎదురుగా ఉన్న వాయుపుత్ర క్లబ్ ఆవరణలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు స్వచ్ఛందంగా రక్తదానం చేయవచ్చన్నారు. దాతలు 88852 03519 నంబరుకు ఫోన్‌చేసి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

సినిమా గైడ్

- **లైలా:** శ్రీ వెంకటేశ్వర-1, రమాదేవి, శ్రీరామా, గోకుల్, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), మోహిని (గాజువాక), మౌర్య (గోపాలపట్నం),
- **తండేల్ :** జగదాంబ, సంగం, కామేశ్వరి, శ్రీవెంకటేశ్వర, శ్రీలీలామహల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ(గోపాలపట్నం), అన్నపూర్ణ(కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ)
- **మదగజరాజ:** జగదాంబ, సౌజన్య (గోపాలపట్నం),
- **సంక్రాంతికి వస్తున్నాం:** శారద, మెలోడి, జగదాంబ, కాంతి, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), తాతా, రాములమ్మ (తగరపువలస)
- **డాకు మహారాజ్ :** శరత్, శ్రీకన్య, కిన్నెర, సుకన్య, మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్, సప్తగిరి (తగరపువలస)
- **గేమ్ ఛేంజర్ :** మెలోడి, సంగం, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), కన్యకాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 36, టమాటా 10, వంకాయలు (తెలుపు) 14, వంకాయలు (నలుపు) 18, బెండకాయలు 42, పచ్చిమిర్చి 32, కాకరకాయలు 34, బీరకాయలు 54, ఆనపకాయ14, కాలీఫ్లవర్ 14, క్యాబేజి 12, క్యారెట్ 27 దొండకాయలు 28, బంగాళదుంపలు 13, అరటికాయ 6, మునక్కాడలు (కిలో) 60, అల్లం 48, బరబాటి 28, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 26, దోసకాయలు 28, వెల్లుల్లి 120, కొబ్బరికాయ25, బీన్స్ (పెన్సిల్) 36, కీరదోస 32, కాప్సికమ్ 38, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 32 చిలగడదుంపలు 34, కంద 64, దేముడు చిక్కుడు 28, గోరు చిక్కుడు 30, కూర పెండలం 26, బ్రకోలి 55 , నూల్‌కోల్ 30, పనసపొట్టు 200, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 15, పుదీన (కట్ట) 4, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 80, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 20, మామిడి అల్లం 46, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	435
విజయనగరం	439
శ్రీకాకుళం	439

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	90
లైవ్ ధర	100
విత్ స్కిన్	190
స్కిన్‌లెస్	200


హనుమంతువాకలో డబ్బీరు నరసింహస్వామి సాగుచేస్తున్న మిద్దె తోట



కేఎం రావు మిద్దెతోటలో విరగ్గాసిన టమాటా, ఆనపకాయ

మన ఇంట... ఆరోగ్య పంట!

- మిద్దె సాగుపై పెరుగుతున్న ఆసక్తి
- స్ఫూర్తిగా నిలిచిన విశ్రాంత ఉద్యోగులు

ఎంవీపీ కాలనీ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మార్కెట్లో కొనే కూరగాయలపై నమ్మకం కుదరడం లేదు. రసాయనాలు, క్రిమి సంహారక మందులను వినియోగించి పండించడంతో అవి ఎలాంటి వ్యాధులు తెచ్చిపడతాయో తెలియని భయం వెంటాడుతోంది. అయినా తప్పనిసరి పరిస్థితిలో కొనుగులు చేస్తున్నాం. కాగా కొంతమంది కూరగాయలను తాజాగా ఉంచడానికి రసాయనాల్లో ముంచి తీస్తుంటే, గ్రీన్ పీస్, పొటల్స్ వంటివి రంగుల్లో ముంచి తీస్తున్నారు. ఇలా కల్తీ చేసి విక్రయించడంతో మరింత ప్రమాదకరంగా మారాయి. ఈ పరిస్థితిలో మన ఇంట ఆరోగ్య పంట పండిస్తే ఎలా ఉంటుందనే ఆలోచనలోంచే మిద్దె పంట ప్రచారంలోకి వచ్చింది.

విశ్రాంత ఉద్యోగుల కృషి

నగరంలో ఏ ఇంటి చూసినా అడుగు ఖాళీ స్థలం ఉండడం లేదు. కాంక్రీటు వనంగా మారిపోయిన నేపథ్యంలో మేడనే వ్యవసాయ కేంద్రంగా మారుస్తున్నారు. అవకాశమున్న వారు దీనిపై దృష్టి సారిస్తే ఆరోగ్యకరమైన కూరగాయలతో పాటు మానసిక, శారీరక ఆరోగ్యం సొంతమవుతుంది. ఇంటి మేడపై తక్కువ ఖర్చుతో ఇద్దరు విశ్రాంత ఉద్యోగులు చేస్తున్న సాగు స్ఫూర్తిగా నిలుస్తోంది అతని పేరు కేఎం రావు. బీఎస్ఎన్ఎల్‌లో డివిజనల్ ఇంజనీరుగా పనిచేసి, ఉద్యోగ విరమణ చేశారు. ఎంవీపీ కాలనీ పన్నెండో సెక్టరులోని తన ఇంటిపై ఖాళీ సమయాన్ని మొక్కల పెంపకానికి వినియోగిస్తున్నారు. ఫలితంగా తాజా కూరలు, పువ్వులు లభిస్తున్నాయి. పదేళ్లగా ఇదే పనిలో ఉన్నారు. అక్కడ టమాటా, నేతి బీర, ముల్లంగి, నిమ్మ, బూడిద గుమ్మడి, వంగ, పాలకూర, మెంతి, కొత్తిమీర, తోటకూర, చిక్కుడు వంటి అనేక రకాల కూరగాయలు పండిస్తున్నారు.


డబ్బీరు నరసింహస్వామి ఆదాయపన్ను శాఖలో పనిచేసి, రిటైర్ అయ్యారు. హనుమంతువాక సమీపంలోని విజయదుర్గాకాలనీలో ఉంటున్న ఆయన పదేళ్లగా మేడపై ఆకుకూరలు, కూరగాయలు, పూల మొక్కలు పెంచుతున్నారు. తన రెండు భవనాల మేడలను దీనికే వినియోగిస్తున్నారు. గోరు చిక్కుడు, బరబాటి, పచ్చిమిర్చి, బెండకాయ, గోరింటాకు, కరివేపాకు, పొన్నగంటి, గోంగూర, తోటకూర, వంకాయతో పాటు సుమారు 20 రకాల పూల మొక్కలను పెంచుతున్నారు.

మార్కెట్ ధరలతో పోల్చవద్దు



ఇంట్లో పండించుకున్న కూరగాయలను బయటి ధరలతో పోల్చవద్దు. ఖర్చు ఎక్కువే అయినా పూర్తి సురక్షితం. మార్కెట్లో కొనే వాటితో ఎంతో కొంత అనారోగ్యం తెచ్చుకుంటున్నాం. మనం పెంచుతున్నవి అలా కాదు. మిద్దె సాగు ఆనందాన్నిస్తోంది. వ్యాయామం అవుతోంది. మట్టి, గెత్తం, కొబ్బరిపొట్టు, వేప పిండి, జీవామృతం తయారుచేసి వేయడంతో మొక్కలు సారవంతంగా పెరుగుతున్నాయి - **కేఎం రావు, ఎంవీపీ కాలనీ**

తక్కువ ఖర్చుతో పండిస్తున్నా



నా ఆరోగ్యానికి మిద్దె సాగే కారణం. ఇనుప స్టాండ్లు, వాటికి పెయింట్లు, కుండీలకు ఖర్చయింది. గెత్తం రూ.వెయ్యికి దొరుకుతోంది. మట్టిలో చీమల మందు కలపితే పురుగులు రావడం లేదు. పసుపు, బూడిదను చల్లుతుంటా. రోజూ సుమారు మూడు గంటలు మొక్కల పెంపకానికే. కూరగాయలు చుట్టుపక్కల వారికి కూడా ఇస్తున్నాం. ప్రతి ఒక్కరూ మిద్దె పంటలపై దృష్టి సారించాలి. - **డబ్బీరు నరసింహస్వామి, హనుమంతువాక**

రహదారి ఆక్రమణలపై అధికారుల సర్వే


పిఠాపురంకాలనీ రోడ్డు ఆక్రమణలపై సర్వే చేస్తున్న వుడా, జీవీఎంసీ అధికారులు

మద్దిలపాలెం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 22వ వార్డు పిఠాపురం కాలనీ రోడ్డు ఆక్రమణలను సోమవారం వుడా, జీవీఎంసీ సర్వే శాఖ సిబ్బంది పరిశీలించారు. లేఅవుట్ ఏరియా, ప్రతిపాదిత రోడ్డు ఎంతన్నది గమనించారు. పిఠాపురంకాలనీ వుడా 40/91 ప్రైవేట్ లేఅవుట్‌లో రోడ్డు ఆక్రమణలపై పలుమార్లు 'ఆంధ్రజ్యోతి'లో కథనాలు ప్రచురించడం, స్థానికుల ఫిర్యాదుతో ఈ సర్వే చేపట్టారు. గతంలోనూ జీవీఎంసీ టౌన్ సర్వేయర్ రోడ్డును సర్వే చేసి నివేదికను అధికారులకు అప్పగించారు. అది మాయం కావడంతో మళ్లీ సర్వే చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. ఈ విషయమై వీఎంఆర్డీఏ కమిషనర్‌కూ ఫిర్యాదు అందింది. దీంతో ఈ రెండు విభాగాల సర్వేయర్లతో ఉదయం రోడ్డును పరిశీలించారు. బాధితులు, రోడ్డు ఆక్రమణ ఆరోపణలు ఎదుర్కొంటున్న స్థల యజమానుల డాక్యుమెంట్లను పరిశీలించారు. లేఅవుట్ ప్రకారం రోడ్డు ఎంతమేర ఉందో నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామని, తదుపరి చర్యలు వారు తీసుకుంటారని సర్వేయర్లు తెలిపారు.

పెదగదిలిలో 22 నుంచి మహాశివరాత్రి ఉత్సవాలు

- పోస్టర్ ఆవిష్కరించిన ఆలయ కమిటీ ప్రతినిధులు


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

ఆరిలోవ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): పెదగదిలి కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 22 నుంచి 26 వరకు మహాశివరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు కోల బంగారయ్య తెలిపారు. ఆలయంలో సోమవారం ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. 22న ఉత్సవమూర్తులకు తిరువీధి, పల్లకీ సేవ, ఊరేగింపు ఉంటుందన్నారు. శివలింగానికి 1001 బిందెల పవిత్ర జలాలతో అభిషేకం జరుగుతుందన్నారు. 23న ఆది దంపతుల కల్యాణం, మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ, 26న మహా శివరాత్రి సందర్భంగా ఉదయం 4 గంటల నుంచి స్వామివారికి ప్రత్యేక అభిషేక పూజలు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు ధూళిరఘు, చల్లారాజు, పాల్తేరు శ్యామ్, బొట్టా రమణ, అర్చకులు దార్లపూడి లక్ష్మణ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా గౌరీ పరమేశ్వరుల కల్యాణోత్సవం

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): కొత్తవెంకోజీపాలెంలోని శ్రీజ్ఞానానంద ఆశ్రమం, శ్రీగౌరీజ్ఞానలింగేశ్వరాలయంలో సోమవారం గౌరీ పరమేశ్వరుల కల్యాణం కన్నుల పండువగా జరిగింది. ఆలయ 34వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని చేపట్టిన కల్యాణంలో గ్రామస్థులు, చుట్టుపక్కల ప్రాంతాల వారు పాల్గొని గౌరీ పరమేశ్వరులను భక్తితో కొలిచారు. శివనామ స్మరణతో ఆలయం మారుమోగింది. గౌరీ, పరమేశ్వరులను పూజిస్తే సర్వలోకాలను జయించవచ్చనే నమ్మకంతో భక్తిశ్రద్ధలతో కొలిచారు. ఉదయం 8 గంటలకు మంగళధ్వనితో ప్రారంభమై అఖండ దీపారాధన, విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం సహా మహన్యాస పూర్వక సహస్ర లింగార్చన అభిషేకం, నీరాజన మంత్రపుష్పాలు, ప్రసాద వితరణ తదితర కార్యక్రమాలు చేపట్టారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. సాయంత్రం తిరువీధి మహోత్సవం జరిపారు. ఆలయ ప్రధానార్చకులు ఆరవెల్లి సూర్యప్రకాష్ శర్మ సారథ్యంలో అర్చకులు సుబ్రహ్మణ్యశాస్త్రి, రామకృష్ణశర్మ, బాల భాస్కరశర్మ, సాయి బృందం వేద మంత్రాలతో పూజా కార్యక్రమాన్ని సాగించారు. ఆలయ సముదాయంలో వేంచేసి ఉన్న అయ్యప్పస్వామి ఆలయ అష్టమ వార్షికోత్సవం కూడా జరిగింది. ఈ సందర్భంగా తెల్లవారు జాము నుంచి అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈవో నాయుడు, దేవస్థానం సిబ్బంది, గ్రామ సేవా సంఘం కార్యవర్గ సభ్యులు, గ్రామస్తులు, మహిళా మండలి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.


గౌరీపరమేశ్వరుల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న భక్తులు

ప్రీ పీహెచ్‌డీ పరీక్షలు నిర్వహించాలని పరిశోధక విద్యార్థుల నిరసన

విశాఖపట్నం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : ఏయూ ట్రాన్స్ డిసిప్లినరీ హబ్ ద్వారా ప్రవేశం పొందిన పీహెచ్‌డీ స్కాలర్స్‌కు ప్రీ పీహెచ్‌డీ పరీక్షలు నిర్వహించాలని పరిశోధక విద్యార్థులు సోమవారం ఏయూలోని గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. కొన్ని నెలలు నుంచి తాము నిరీక్షిస్తున్నామని, న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఏయూ వైస్ చాన్సలర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ప్రీ టాక్ పూర్తయిన వారికి అవార్డు ప్రదానం చేయాలని, ఇప్పటికే వైవా పూర్తి చేసిన వారికి పీహెచ్‌డీ డిగ్రీలను అందించాలని డిమాండ్ చేశారు.

మాజీ వీసీ ప్రసాదరెడ్డిని అరెస్ట్ చేయాలి

టీడీఆర్ హబ్ ద్వారా జరిగిన అక్రమ పీహెచ్‌డీలను తక్షణమే రద్దు చేయాలని కోరుతూ ఆంధ్ర యూనివర్సిటీ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో వర్సిటీలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. అక్రమ ప్రవేశాలను రద్దు చేయడంతోపాటు వీటికి అవకాశం కల్పించిన మాజీ వీసీ ప్రసాదరెడ్డిని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రవేశాలు కల్పించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా వారంతా కోరారు.



ఏయూలోని గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న పరిశోధక విద్యార్థులు

రహదారిని ఆక్రమించి వెలుస్తున్న దుకాణాలు

ఆరిలోవ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): రహదారులు ఆక్రమణలకు గురవుతున్నా అడ్డుకోవలసిన యంత్రాంగం కాసులకు కక్కుర్తి పడి చూసీచూడనట్లు మిన్నకుంటోంది. జీవీఎంసీ పదో వార్డులోని పలు ప్రాంతాల్లో రోడ్లు ఆక్రమించి చిరు దుకాణాలు పెడుతున్నారు. మరికొందరు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను కూడా వదలడం లేదు. దానిని ఆనుకుని కూడా బడ్డీ పెడుతున్నారు. రోడ్లపైనే భవన నిర్మాణ సామగ్రిని ఇంకొందరు నిల్వ చేస్తూ రాకపోకలకు ఇబ్బందులు సృష్టిస్తున్నారు. ఇలాంటి చర్యలతో రోడ్లు కుచించుకుపోయి వాహన రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వీటిని నిరోధించాల్సిన జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ విభాగం కళ్లుమూసుకుంటోంది. కిందిస్థాయి సిబ్బంది ఆక్రమణదారుల నుంచి కాసులు తీసుకుని పట్టించుకోవడంలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. రవీంద్రనగర్ నుంచి తోటగరువు వెళ్లే మార్గం నిత్యం రద్దీగా ఉంటుంది. జీవీఎంసీ, ట్రాఫిక్ పోలీసులు ఇటువైపు దృష్టి నిలిపి ఆక్రమణలు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.


రవీంద్రనగర్- తోటగరువు రోడ్డుపై ఇలా...


ఆరిలోవలో రోడ్డుపైనే భవన నిర్మాణ సామగ్రి

మాఘమాసం గణపతికి మహా విశిష్టత

- ప్రముఖ ప్రవచనకర్త సామవేదం షణ్ముఖశర్మ



ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తున్న సామవేదం షణ్ముఖశర్మ

ఎంవీపీ కాలనీ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మాఘమాసంలో బహుళ చవితి రోజున మహాగణపతి బ్రహ్మదేవుడికి వక్రతుండంతో సాక్షాత్కరించారని, అందుకే ఈ మాసంలో గణపతికి అంత విశిష్టత ఉంటుందని ప్రముఖ ప్రవచనకర్త సామవేదం షణ్ముఖశర్మ అన్నారు. ఎంవీపీ కాలనీలోని ఆరో సెక్టరు భద్రం పార్కులో జరుగుతున్న మహాగణపతి వైభవంపై ఇస్తున్న ప్రవచనాల్లో భాగంగా సోమవారం సాయంత్రం షణ్ముఖశర్మ ఉపన్యసించారు. సర్వమానవాళి, లోక సంక్షేమం కోసం మహాగణపతి లక్ష మోదక యజ్ఞంలో వివిధ గణపతులకు సంప్రదాయబద్ధంగా వైదిక పద్ధతిలో పూజలు జరుగుతున్నాయన్నారు. మాఘమాసంలో కృష్ణ చతుర్థికి ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. ఆ రోజున తప్పనిసరిగా గణపతిని పూజించాలని సూచించారు. పెద్దసంఖ్యలో పరిసర ప్రాంతాల భక్తులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ వెంకటసుబ్బయ్యకు ఐఎస్‌టీఈ అవార్డు


ప్రొఫెసర్ వెంకటసుబ్బయ్యకు అవార్డు అందిస్తున్న అతిథులు

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఏయూ మెకానికల్ ఇంజనీరింగ్ సీనియర్ ప్రొఫెసర్ జేఎన్‌టీయూ విజయనగరం పూర్వ వీసీ ఆచార్య కె.వెంకటసుబ్బయ్యకు 2024 సంవత్సరానికి గాను ప్రతిష్ఠాత్మకమైన ఐఎస్‌టీఈ నేషనల్ బెస్ట్ అడ్మినిస్ట్రేటర్ అవార్డు లభించింది. ఈ అవార్డును పంజాబ్ రాష్ట్ర ఆర్థిక మంత్రి హర్పాల్ సింగ్ చీమా, ఏఐసీటీఈ ఛైర్మన్ ప్రొఫెసర్ టి.జి.సీతారామ్‌లు లామ్‌రిన్ టెక్ స్కిల్ యూనివర్సిటీలో జరిగిన 54వ ఐఎస్‌టీఈ నేషనల్ వార్షిక ఫ్యాకల్టీ కాన్వెన్షన్‌లో అందజేశారు. ఈ పురస్కారం ప్రొఫెసర్ కె.వెంకటసుబ్బయ్య వివిధ విశ్వవిద్యాలయాలు, ప్రొఫెషనల్ బాడీల్లో ప్రాధాన్యమైన నాయకత్వాన్ని, శాస్త్రీయ పరిజ్ఞానానికి ఆయన అంకితభావాన్ని, సాంకేతిక విద్యలో పరిశోధన, ఆవిష్కరణలలో చేసిన అమూల్యమైన కృషిని గుర్తిస్తూ అందజేశారు. ఈ సందర్భంగా ఆచార్య వెంకట సుబ్బయ్యకు ఏయూ విశ్వవిద్యాలయ ఆచార్యులు, అధికారులు అభినందనలు తెలిపారు.

విశాఖ చిత్రకారుడికి అరుదైన గౌరవం

- 'జాగువర్ విత్ కళంకారి' చిత్రానికి ప్రగతి చిత్ర అవార్డు


అవార్డు అందుకుంటున్న కనుమూరి శ్రీనివాసరావు, (ఇన్‌సెట్లో) గీసిన చిత్రం

డాబాగార్డెన్స్ ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కళలు, సాంస్కృతిక శాఖ సహకారంతో క్రియేటివ్ ఫైన్ ఆర్ట్స్ అకాడమీ గుంటూరులో నిర్వహించే ఇండియన్ ఆర్ట్ ఫెస్టివల్‌లో భాగంగా నిర్వహించిన జాతీయ చిత్రకళా పోటీలలో విశాఖ నగరం డాబాగార్డెన్స్ ప్రాంతానికి చెందిన చిత్రకారుడు కనుమూరి శ్రీనివాసరావు పంపిన చిత్రం 'జాగువర్ విత్ కళంకారి' అనే చిత్రం ప్రగతి చిత్ర అవార్డు గెలుచుకుంది. మన ఆంధ్రప్రదేశ్ సాంప్రదాయ చిత్ర కళ కళంకారిని తనదైన శైలిలో చూపించిన నేపథ్యంలో ముఖ్య అతిథుల నుంచి ప్రగతి చిత్ర అవార్డును శ్రీనివాసరావు అందుకున్నారు. ది బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా జనరల్ సెక్రటరీ తన్నీరు శ్రీనివాసరావు, ప్రముఖ చిత్రకారులు డా.జి.వై.గిరి సమక్షంలో సత్కరించడం ఆనందంగా ఉందని శ్రీనివాసరావు తెలిపారు.

ఫిర్యాదుదారులకు సాంత్వన చేకూర్చండి

- అధికారులకు కలెక్టర్ హరేంధిర ప్రసాద్ దిశానిర్దేశం


అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్

మహారాణిపేట, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఒకే సమస్యపై ప్రజల నుంచి పదేపదే వచ్చే వినతులపై లోతైన విచారణ జరిపి, తగిన పరిష్కారం చూపాల్సిన బాధ్యత అధికారులపె ఉందని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ అన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వస్తున్న ఫిర్యాదులు.. అధికారులు తీసుకుంటున్న చర్యలపై సోమవారం కలెక్టరేట్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. పలు అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ప్రాధాన్యత ఇవ్వాలని, స్వీకరిస్తున్న అర్జీలపై సత్వరమే స్పందించి, వారికి సాంత్వన చేకూర్చేలా నిర్ణయం తీసుకోవాలని సూచించారు. అర్జీదారులకు అధికారులు నేరుగా ఫోన్‌చేసి మాట్లాడాలని, క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించాలని, ఎట్టి పరిస్థితుల్లో అదే సమస్యపై మళ్లీ అర్జీ రావడానికి వీల్లేదని స్పష్టం చేశారు. ఈ నెల 18 నుంచి 28 వరకు ప్రత్యేక ఆధార్ శిబిరాలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు.సమావేశంలో డీఆర్వో భవానీ శంకర్,సబ్ కలెక్టర్ శేష శైలజ సీతారామారావు, అధికారులు పాల్గొన్నారు.

మసాజ్ ముసుగులో వ్యభిచారం

- నిర్వాహకుడితో పాటు మరో ఇద్దరి అరెస్టు

కూర్మన్నపాలెం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మసాజ్ సెంటర్ (స్పా) ముసుగులో జరుగుతున్న వ్యభిచారాన్ని దువ్వాడ పోలీసులు బట్టబయలు చేశారు. కూర్మన్నపాలెంలోని ఎస్ఎస్ బ్యూటీ బార్‌లో మూడేళ్లగా మసాజ్ సెంటర్ నిర్వహిస్తున్నారు. కాగా డయల్ 100కు వచ్చిన సమాచారం మేరకు దువ్వాడ సీఐ మల్లేశ్వరరావు మసాజ్ సెంటర్ (స్పా)పై ఆదివారం రాత్రి దాడి చేశారు. గాజువాక శ్రీనివాసనగర్‌కు చెందిన ఆర్.దీక్షిత్‌కుమార్ వివిధ జిల్లాల నుంచి యువతులు, మహిళలను ఇక్కడకు తీసుకువచ్చి వారితో మసాజ్‌తో పాటు వ్యభిచారం చేయిస్తున్నట్టు పోలీసుల విచారణలో తేలింది. దీక్షిత్‌తో పాటు అతడికి సహకరిస్తున్న అనకాపల్లి జిల్లా చోడవరం మండలం లక్ష్మీపురానికి చెందిన బి.మాధవరావును, విటుడు బోలేరామ్ దేవసినిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఆర్థిక ఇబ్బందులతో మసాజ్‌తో పాటు వ్యభిచారం చేస్తున్న మహిళను హోమ్‌కు తరలించినట్టు పోలీసులు తెలిపారు.

యువతి అదృశ్యంపై ఫిర్యాదు

మర్రిపాలెం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఆలయానికని వెళ్లిన యువతి అదృశ్యమైనట్లు ఎయిర్‌పోర్ట్ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. 57వ వార్డు ఆశాపువానిపాలేనికి చెందిన యువతి (17) విశాఖ ఉమెన్స్ కాలేజీలో ఇంటర్ చదువుతోంది. ఇంట్లో చెప్పిన మాట వినడంలేదని ఇటీవల పలాసలోని తమ బంధువుల ఇంటికి పంపారు. ఈ నెల 4న ఆమె తల్లిదండ్రులు వెళ్లి తిరిగి నగరానికి తీసుకువచ్చారు. కాగా 11న ఆలయానికని వెళ్లి తిరిగి రాకపోవడంతో ఆమె తండ్రి ఎయిర్‌పోర్ట్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో ఎస్ఐ రామకృష్ణ దర్యాప్తు చేస్తున్నారు.

జాతీయ క్రీడా పోటీల్లో సత్తా చాటిన సరోజిని



సరోజినిని సత్కరిస్తున్న సత్యదేవ్

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): రాజస్థాన్‌లోని అళ్వార్‌లో ఇటీవల జరిగిన ఇండియా మాస్టర్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ క్రీడా పోటీల్లో పాల్గొన్న దువ్వూరి సరోజిని స్వర్ణ, రజత, కాంస్య పతకాలు సాధించి జాతీయ స్థాయిలో తన సత్తా చాటింది. గత రెండేళ్లలో విశాఖ జిల్లా స్థాయిలో రెండుసార్లు, నెల్లూరు, గుడివాడలలో రాష్ట్ర, జాతీయ స్థాయిలో కర్ణాటకలోని ఉడిపి, మహారాష్ట్రలోని ముంబయి, రాజస్థాన్‌లోని అళ్వార్, అంతర్జాతీయ స్థాయిలో అయోధ్యలో జరిగిన అనేక క్రీడా పోటీల్లో పాల్గొన్నారు. సరోజిని కేవలం రెండేళ్ల వ్యవధిలో 11 స్వర్ణ, 6 రజతం, 4 కాంస్య పతకాలు సాధించి విశాఖ నగర ప్రముఖుల మన్ననలు పొందింది. ఈ సందర్భంగా జనకులం ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ చింతలపాటి సత్యదేవ్ సోమవారం తాటిచెట్లపాలెంలోని ఫౌండేషన్ కార్యాలయంలో ఆమెను ఘనంగా సత్కరించారు. క్రీడల్లో చాలామందిని తీర్చిదిద్దుతున్న విశాఖపట్నం వెటరన్ అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మంగా వరప్రసాద్‌ను, కార్యవర్గాన్ని సత్యదేవ్ అభినందించారు.

ఎదుగుదలకు శిక్షణ దోహదం



శిక్షణ పొందిన అభ్యర్థులతో అధ్యాపకులు

కంచరపాలెం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల్లో నాలుగు రోజులు జరిగిన ఫార్మాసిస్టుల శిక్షణ తరగతులు సోమవారం ముగిశాయి. ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన, లైఫ్ సైన్సెస్ వారి స్కిల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ ఆధ్వర్యంలో తరగతులు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రిన్సిపాల్ డా.కె.నారాయణరావు మాట్లాడుతూ.. మొదటి బ్యాచ్‌గా 40 మంది నమోదిత ఫార్మాసిస్టులకు ఫార్మా కోవిజిలెన్స్ కేస్ ప్రాసెసింగ్ అనే అంశంపై ఉచిత శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఫార్మాసిస్టులు తమ కెరియర్‌లో ఎదగడానికి నైపుణ్యం అందించడం అభినందనీయమన్నారు. ఫార్మా అధ్యాపకుడు జి.సాయి రాజేష్‌ను ప్రిన్సిపాల్ అభినందించారు. ఫార్మసీ విభాగాధిపతి గోవర్ధన్‌రావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

'ఎస్సీ సర్టిఫికెట్లు మంజూరు చేయకపోతే ఆందోళన'

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): బేడ జంగమ కులానికి ఎస్సీ సర్టిఫికెట్లు మంజూరు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బేడ జంగమ హక్కుల పోరాట సమితి ఏపీ రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు వై.మధు కోరారు. సోమవారం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. బేడ జంగమ కులస్తులు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో 2008 వరకు ఎస్సీ సర్టిఫికెట్ జారీ చేసేవారన్నారు. అదే ఏడాది జులై నుంచి ఇప్పటి వరకు కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేయడం లేదన్నారు. ఎన్నికల ముందు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి లోకేశ్ ఇచ్చిన హామీ నెరవేర్చాలన్నారు. అసెంబ్లీలో తీర్మానం చేసిన నివేదికను కేంద్రానికి పంపాలని కోరారు. లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్ల ముందు రిలే నిరాహార దీక్షలతో పాటు ఆందోళనలు చేయనున్నట్టు హెచ్చరించారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మేయర్‌పై అవిశ్వాసం?

... 5వ పేజీ తరువాయి

కలిశారు. కాగా ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎన్నికల్లో సిట్టింగ్ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మకు మద్దతుపై కూడా సమావేశంలో చర్చించారు. ఈ విషయాన్ని పట్టభద్ర ఎమ్మెల్సీ చిరంజీవిరావు ప్రస్తావించారు. 2023లో జరిగిన ఉత్తరాంధ్ర పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి వేపాడ చిరంజీవిరావుకు రఘువర్మ మద్దతు పలికారు. అప్పటి నుంచి టీడీపీలో పలువురు నేతలతో రఘువర్మకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. ప్రధానంగా రఘువర్మ నామినేషన్‌కు చిరంజీవిరావు హాజరుకావడంతోపాటు ప్రచారం చేస్తున్నారు. రఘువర్మకు మద్దతు గురించి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో చర్చించిన తరువాతే ఒక నిర్ణయానికి రావాలని ఎమ్మెల్యేలు నిర్ణయించారు. ఈ సమావేశానికి పార్లమెంటరీ నియోజకవర్గ పార్టీ అధ్యక్షుడు గండి బాబ్జీకి ఆహ్వానం లేదు. అయితే ఎంపీ శ్రీభరత్‌ను కలిసేందుకు దసపల్లా హోటల్‌కు వెళ్లిన బాబ్జీని పీలా గోవింద, పీలా శ్రీనివాస్‌లు సమావేశానికి తీసుకువెళ్లారు. ఆయన కొద్దిసేపు ఉండి ఎంపీతో పాటు బయటకు వచ్చేశారు.

ఆలయ ప్రాంగణంలో అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదు

సీతమ్మధార, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 24వ వార్డు నక్కవానిపాలెం ఇలవేలుపు, గ్రామ దేవత ఏడుగుడులు ముత్యాలమ్మ ఆలయ ఆవరణలో అక్రమ నిర్మాణా లు జరిగాయని, ప్రజలకు సంబంధించిన స్థలం ఆక్రమించకుండా చర్యలు తీసుకోవాలని ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజును నక్కవానిపాలెం గ్రామ కమిటీ అధ్యక్షుడు గుడ్ల కాటారాజు రెడ్డి, కార్యదర్శి కారాపురెడ్డి శ్యామ్‌రెడ్డి, ఇతర ప్రతినిధులు అభ్యర్థించారు. సోమవారం ఆయనకు వినతిపత్రం సమర్పించారు. అమ్మవారి ఏడుగుడుల స్థలంలో ఎరుసు నర్సింగరావు ఆలయ ధర్మకర్తగా చెప్పుకొని స్థలం ఆక్రమించి, ఆవరణ చుట్టూ గోడ నిర్మించి, బడ్డీలు ఏర్పాటు చేశారని, భక్తులకు అమ్మవారి ఆలయం కనిపించకుండా చేస్తున్నారని ఆరోపించారు. ఏడుగుడులు అనుకొని ఉన్న అపార్టుమెంట్‌కు దారి నిమిత్తం ఆలయ ఆవరణలో రోడ్డు వేయించారని, ఈ అక్రమాలపై గ్రామ కమిటీ, ప్రజలు ప్రశ్నిస్తే బెదిరింపులకు పాల్పడుతూ, పోలీసు కేసులు పెడతామని దౌర్జన్యానికి దిగుతున్నారని ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు దృష్టికి తీసుకెళ్లారు. గ్రామదేవత ముత్యాలమ్మ, ఏడుగుడులు ఆలయ స్థలం చుట్టూ అక్రమంగా నిర్మించిన ప్రహరీ, ఆవరణలో నిర్మించిన దుకాణాలు తొలగించి భక్తులకు ఇబ్బంది కలగకుండా చర్యలు చేపట్టాలని గ్రామ కమిటీ ప్రతినిధులు, నక్కవానిపాలెం గ్రామస్థులు కోరారు. స్పందించిన ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు ఆలయ స్థలం ఆక్రమించినవారిపై తక్షణ చర్యలు తీసుకోవాలని కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్, జోనల్ కమిషనర్, అర్బన్ తహసీల్దార్, అసిస్టెంట్ సిటీ ప్లానర్‌కి లేఖలు పంపారు. కొందరు అధికారులకు ఫోను చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. నక్కవానిపాలెం గ్రామస్థులకు అండగా ఉంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.



వినతిపత్రాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు

భక్తిశ్రద్ధలతో పార్వతీపరమేశ్వరుల కల్యాణం

సీతంపేట, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ విశాఖ 25వ వార్డు సీతంపేట గణేష్‌నగర్‌లోని పార్వతీశ్వరాలయం 35వ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం పార్వతీపరమేశ్వరుల కల్యాణ మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దేవదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు భాస్కర్ శర్మ, శివాజీ శర్మలు వేద మంత్రాలతో గణపతి పూజ, పుణ్యాహవచనం, పంచగవ్యప్రాసన, అస్త్రరాజార్చన, వాస్తుపూజ, అంకురార్పణ, ధ్వజారోహణ, అగ్ని ప్రతిష్ఠాపన పూజా కార్యక్రమాలు జరిపారు. సాయంత్రం హోమాలు, స్వామివారి కల్యాణం, పూర్ణాహుతి, వేద ఆశీర్వచనం చేశారు. కల్యాణోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



సీతంపేటలో పార్వతీపరమేశ్వరుల కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

విద్యార్థుల అభ్యసన సామర్థ్యంపై పరీక్ష



విద్యార్థులను ప్రశ్నిస్తున్న జిల్లా విద్యాశాఖాధికారి ప్రేమ్‌కుమార్

జగదాంబ కూడలి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): వన్‌టౌన్‌లోని ఎంవీడీఎం పాఠశాలలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. పదో తరగతి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని తెలుసుకునే ప్రయత్నం చేశారు. విద్యార్థులతో నేరుగా తరగతి గదిలో మాట్లాడి పలు పాఠ్యాంశాలపై ప్రశ్నలు వేశారు. కొందరు విద్యార్థులు సమాధానం చెప్పడంలో కాస్త తడబడ్డారు. మరికొందరు చెప్పిన సమాధానాలు విని డీఈవో వారికి కొంతసేపు క్లాస్ తీసుకున్నారు. పరీక్షలు దగ్గర పడడంతో డీఈవో విద్యార్థుల్లో ధైర్యాన్ని నింపే ప్రయత్నం చేశారు. అనంతరం ఉపాధ్యాయులతో సమీక్షించారు. ఉత్తీర్ణత శాతం పెంచేందుకు మరింత కృషి చేయాలన్నారు. సమావేశంలో ప్రధానోపాధ్యాయిని శేషకుమారి తదితరులు పాల్గొన్నారు.

'జనన ధ్రువీకరణ పత్రాల జారీలో నిర్లక్ష్యం వద్దు'



రికార్డులు పరిశీలిస్తున్న బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు పద్మావతి

మర్రిపాలెం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మర్రిపాలెం ఆర్అండ్‌బీ జంక్షన్ సమీపంలోని శిశుగృహను రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు బి.పద్మావతి సోమవారం సందర్శించారు. చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారంపై ఆరా తీశారు. శిశుగృహ పరిసరాలను పరిశీలించారు. పలు రికార్డులు చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం నరేంద్రనగర్‌లోని అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించిన ఆమె అక్కడ సచివాలయాన్ని సందర్శించి చిన్నారుల మ్యాపింగ్‌ను తొందరగా పూర్తి చేయాలని సూచించారు. చిన్నారుల జనన ధ్రువపత్రాల జారీలో నిర్లక్ష్యం చేయవద్దన్నారు. ఆమె వెంట ఐసీడీఎస్ అర్బన్ సీడీపీఓ ఎంవీ రమణకుమారి, భీమిలి సీడీపీఓ ఎం.శ్రీదేవి, శిశుగృహ మేనేజర్ సుజాత, జిల్లా బాలల సంరక్షణ విభాగం అధికారిణులు శారదాదేవి, లోవలక్ష్మి తదితరులు ఉన్నారు.

ఉక్కుకు చిక్కులు తొలగేదెన్నడో!?

... 5వ పేజీ తరువాయి

ప్రకటించారు. అప్పటి నుంచి విశాఖ ప్లాంటుకు కష్టాలు మొదలయ్యాయి. ఎటువంటి సహాయం అందకపోవడంతో పీకల్లోతు నష్టాల్లోకి వెళ్లింది. అప్పులు రూ.35 వేల కోట్లకు చేరాయి. ముడి పదార్థాలు కరవయ్యాయి. కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు తెర వెనుక ప్రయత్నాలు జరిగాయి. ఇక్కడ విశాఖ ఉక్కు పరిరక్షణ ఉద్యమం మొదలైంది. అయితే గతంలో ఏ ప్రభుత్వమూ చేయని విధంగా కూటమి నేతల ఒత్తిడి వల్ల కేంద్ర ప్రభుత్వం ఇటీవల రూ.11,440 కోట్ల సాయం ప్రకటించింది. అయితే సొంత ఐరన్‌ఓర్ గనులు లేకపోవడం పెద్ద సమస్యగా మారింది. ఉత్పత్తి వ్యయం ఇతర ప్లాంట్ల కంటే ఎక్కువగా ఉంది. ఉక్కు కర్మాగారానికి మానవ వనరులే కీలకం. యాజమాన్యం ప్రతికూల వైఖరి వల్ల గతంలో ఉద్యోగులు కష్టపడి 15 ఏళ్ల వరుసగా లాభాలలో నడిపించారు. వేతన ఒప్పందం తరువాత ఉద్యోగులకు ఇవ్వాల్సిన బకాయిలను పెండింగ్‌లో పెట్టేశారు. ప్రస్తుత యాజమాన్యం ఉద్యోగులపై వివక్ష చూపుతూ పాత వేతనాల్లో రకరకాల పేర్లతో 25 శాతం కోత విధించింది. ఆ మిగిలిన జీతాలు కూడా నెల నెలా ఇవ్వడం లేదు. మరో వైపు ఉద్యోగుల సంఖ్య తగ్గించుకుంటూ వస్తున్నారు. వాస్తవానికి 73 లక్షల టన్నుల ఉత్పత్తికి కొత్తగా ఐదు వేల మంది ఉద్యోగులు కావాలి. రిక్రూట్‌మెంట్ మొదలుపెడితే నిర్వాసితులకు 2,500 ఉద్యోగాలు వస్తాయి. కానీ అవేమీ చేయకుండా ఉన్నవారిలో 1,200 మందికి వీఆర్ఎస్ ఇచ్చి పంపించేందుకు ఏర్పాట్లు చేశారు. కాంట్రాక్టు కార్మికులను 30 శాతం తగ్గించడానికి కుట్ర జరుగుతోంది.

తలకు మించిన భారమే

ఆర్థిక ప్యాకేజీ ఇచ్చిన ఉక్కు శాఖా మంత్రి కుమారస్వామి ఇక్కడకు వచ్చినప్పుడు...'కేంద్ర సాయంతో మూడు బ్లాస్ట్ ఫర్నేస్‌లు నడుపుకొని మీ జీతాలు మీరు తీసుకోండి' అని ప్రకటించారు. సొంత గనులు లేకుండా, వేల కోట్ల రూపాయల అప్పులు తీర్చకుండా నెల నెలా వందల కోట్ల రూపాయల వడ్డీలు చెల్లిస్తూ, 73 లక్షల టన్నుల ఉత్పత్తికి అవసరమైన వేలాది కోట్ల విలువైన ముడి పదార్థాలను సమకూర్చుకోవడం యాజమాన్యానికి తలకు మించిన భారం. గత ఐదు నెలలుగా సంస్థకు శాశ్వత ఛైర్మన్ లేరు. వేరొకరిని డిప్యుటేషన్‌పై తీసుకువచ్చి నియమించారు. ప్లాంటు ఆపరేషన్ వ్యవహారాలు పర్యవేక్షించే డైరెక్టర్ లేరు. ఇండిపెండెంట్ డైరెక్టర్ పోస్టులు మూడు ఖాళీగా ఉన్నాయి. ఎవరినీ నియమించకుండా, ఉన్న వారిని తీసేసి, తగ్గించి, అవసరమైన ముడి పదార్థాలు అందించకుండా ప్లాంటును పట్టాలపైకి తేవడం చాలా కష్టం. రెండు బ్లాస్ట్ ఫర్నేస్‌లకే ముడి పదార్థాల సరఫరా అరకొరగా ఉంది. ఇక మూడోది ప్రారంభిస్తే ఎక్కడి నుంచి సమకూర్చుకుంటారో చెప్పడం లేదు. అన్నీ ఇచ్చినా ప్లాంటును పైకి తీసుకురాలేకపోయారని ముద్ర వేయడానికి ఇదంతా చేస్తున్నారనే ఉద్యోగ, కార్మిక వర్గాలు అనుమానిస్తున్నాయి. దీనిపై కేంద్రం, ఎంపీలు, దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.

క్రూయిజ్ టెర్మినల్ నిర్వహణకు టెండర్లు

... 5వ పేజీ తరువాయి

కూడా అవకాశం ఇస్తామని ప్రకటించారు. దీనికి 11 నెలల లీజు పరిమితి ఉంటుందని, ఆసక్తి కలిగిన సంస్థలు ముందుకురావాలని కోరారు.

ఆ మార్గం బాగుపడితే తప్ప ఎవరూ రారు

పోర్టు అధికారులు క్రూయిజ్ టెర్మినల్‌ను పోర్టు ఆవరణలో నిర్మించారు. దీనికి వెళ్లే మార్గం చాలా దారుణంగా, అపరిశుభ్రంగా ఉంటుంది. అది ఇతరులు సంచరించడానికి అనుమతి కూడా లేని ప్రాంతం కావడం గమనార్హం. ఒంటరిగా అటు వైపు ఎవరైనా వెళితే ఏ దారుణమైనా జరిగే ప్రమాదం లేకపోలేదు. గతంలో పర్యాటక శాఖ అధికారులతో పోర్టు నిర్వహించిన సమావేశంలో ఇదే సమస్య చర్చకు వచ్చింది. టెర్మినల్‌కు వెళ్లే మార్గాన్ని అందంగా తీర్చిదిద్దాలని సూచించారు. అయితే దీనిపై అధికారులు దృష్టి సారించలేదు. క్రూయిజ్‌లో వచ్చే పర్యాటకులు అందమైన విశాఖ నగరాన్ని చూడాలనుకుంటారు. వారు క్రూయిజ్ నుంచి దిగగానే ఆ దుర్గంధభరితమైన మార్గంలో నగరంలోకి వస్తే ఎంత వేగంగా వెనక్కి వెళ్లిపోదామా? అనే అభిప్రాయం కలుగుతుంది. పోర్టు అధికారులు ముందు ఆ మార్గాన్ని ఆకర్షణీయంగా తయారు చేయాల్సిన అవసరం ఉంది. అప్పుడే ఒక్కొక్కటిగా సమస్యలు పరిష్కారం అవుతాయి. వ్యాపారులూ అక్కడ కార్యకలాపాల నిర్వహణకు ముందుకువస్తారు. ఆ దిశగా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

రాయగడ-విజయనగరం సెక్షన్‌లో రైల్వే జీఎం తనిఖీలు

విశాఖపట్నం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): తూర్పుకోస్తారైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర్ ఫంక్వాల్ సోమవారం రాయగడ-విజయనగరం సెక్షన్‌లో తనిఖీలు చేపట్టారు. రాయగడ డివిజన్ కార్యకలాపాల నిమిత్తం తాత్కాలిక డివిజనల్ కార్యాలయం, స్టేషన్‌లో అత్యవసర వైద్య సేవల గదిని ప్రారంభించారు. ముందుగా రాయగడ స్టేషన్‌లోని భద్రతా ప్రమాణాలు, మౌలిక సదుపాయాలను పరిశీలించి వాటి మెరుగుకు అధికారులతో చర్చించారు. అనంతరం రాయగడ రైల్వే కాలనీలకు చేరుకుని నివాసితులతో మాట్లాడి సదుపాయాల కల్పనపై అభిప్రాయాలు సేకరించారు. కాలనీలలో కొత్తగా అభివృద్ధి చేసిన పార్కులను సందర్శించి అధికారులను అభినందించారు.

అనంతరం సర్క్యులేటింగ్ ఏరియాలు, రిటైరింగ్ రూమ్స్, క్రూ లాబీ, ఆర్ఆర్ఐ క్యాబిన్, రిలే రూమ్, వెయిటింగ్ హాల్స్, ఫుడ్ కోర్టులు, టికెట్ బుకింగ్, పార్శిల్ కార్యాలయాలు, రన్నింగ్ రూమ్స్, ట్రాక్షన్ డిపో, యాక్సిడెంట్ రిలీఫ్ రైళ్లు, మెడికల్ ఎక్విప్‌మెంట్ వ్యాన్లు, క్యారేజ్ డిపో, స్టేషన్ భవనాలు పరిశీలించి అవసరమైన ప్రణాళికలపై చర్చించారు. అనంతరం జిమిడిపేట నుంచి పార్వతీపురం వరకు స్పీడ్ ట్రయల్ నిర్వహించారు. పార్వతీపురం స్టేషన్‌తోపాటు రైల్వే కాలనీలలో పర్యటించి మౌలిక సదుపాయాలు, భద్రతా ప్రమాణాల నిర్వహణను పరిశీలించారు.

ఘనంగా యూసీసీ టీ20 క్రికెట్ టోర్నీ ప్రారంభం

విశాఖపట్నం స్పోర్ట్సు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఏసీఏ, వీడీసీఏ అనుబంధంతో యునైటెడ్ క్రికెట్ క్లబ్ 11వ యూసీసీ టీ 20 క్రికెట్ చాంపియన్‌షిప్ టోర్నీ సోమవారం ప్రారంభమైంది. వాల్తేరు రైల్వే క్రికెట్ గ్రౌండ్‌లో జరుగుతున్న ఈ టోర్నీకి ఆంధ్ర క్రికెట్ సంఘం (ఏసీఏ) ఉపాధ్యక్షుడు పి.ప్రశాంత్ ముఖ్య అతిథిగా హాజరై ట్రోఫీలను ఆవిష్కరించి మ్యాచ్‌లు ప్రారంభించారు. రంజీ ఆటగాడు కె.వి.శశికాంత్, పి.హరీష్, టోర్నీ నిర్వాహకులు రమణమూర్తి, వెంకటేష్, ప్రతినిధులు పాల్గొన్నారు.

రైల్వేపై గాజువాక గ్రీన్స్ గెలుపు

హోం గ్రౌండ్‌లో జరిగిన తొలి లీగ్ మ్యాచ్‌లో తూర్పుకోస్తారైల్వే ఏడు వికెట్ల తేడాతో గాజువాక గ్రీన్స్ చేతిలో ఓడి నిరాశపరిచింది. తొలుత బ్యాటింగ్ చేసిన రైల్వేస్ నిర్ణీత 20 ఓవర్లలో 94 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ ఎం.ఎస్.దీపక్ (37) మినహా మిగిలినవారు విఫలమయ్యారు. గాజువాక గ్రీన్స్ బౌలర్లలో చెన్ను సిద్దార్థ మూడు వికెట్లు పడగొట్టగా అజయ్‌కుమార్, అప్పన్న, మహీప్‌కుమార్ తలో రెండు వికెట్లు తీశారు.

రిత్విక్ అజేయ సెంచరీ....క్రాంతికి ఆరు వికెట్లు



శతకం బాదిన రిత్విక్

జింక్ గ్రౌండ్‌లో జరిగిన మ్యాచ్‌లో వైజాగ్ వెటరన్స్ 67 పరుగుల తేడాతో సైమండ్స్ బ్లూస్‌పై విజయం సాధించింది. తొలి బ్యాటింగ్ చేసిన వైజాగ్ వెటరన్స్ నిర్ణీత 20 ఓవర్లలో మూడు వికెట్లకు 227 పరుగులు చేసింది. ఓపెనర్ ఈశ్వర్ రిత్విక్ విధ్వంసకర బ్యాటింగ్‌లో అజేయ సెంచరీ (126 నాటౌట్) సాధించాడు. 59 బంతుల్లో 14 ఫోర్లు, ఐదు సిక్సర్లతో స్కోరు బోర్డును పరిగెత్తించాడు. లక్ష్య ఛేదనలో సైమండ్ బ్లూస్ 18.2 ఓవర్లలో 160 పరుగులకు ఆలౌటైంది. వైజాగ్ వెటరన్ బౌలర్ డి.క్రాంతి అద్భుతమైన బౌలింగ్‌తో ఆరు వికెట్లు పడగొట్టి సైమండ్ బ్లూస్ బ్యాటింగ్‌ను దెబ్బతీశాడు.

ఫిర్యాదుదారులకు సాంత్వన చేకూర్చండి

అధికారులకు కలెక్టర్ దిశానిర్దేశం

మహారాణిపేట, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఒకే సమస్యపై ప్రజల నుంచి పదేపదే వచ్చే వినతులపై లోతైన విచారణ జరిపి, తగిన పరిష్కారం చూపాల్సిన బాధ్యత అధికారులపై ఉందని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ అన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వస్తున్న ఫిర్యాదులు.. అధికారులు తీసుకుంటున్న చర్యలపై సోమవారం కలెక్టరేట్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. పలు అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ప్రాధాన్యత ఇవ్వాలని, స్వీకరిస్తున్న అర్జీలపై సత్వరమే స్పందించి, వారికి సాంత్వన చేకూర్చేలా నిర్ణయం తీసుకో వాలని సూచించారు. అర్జీదారులకు "అధికారులు నేరుగా ఫోన్ చేసి మాట్లాడాలని, క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించాలని, ఎట్టి పరిస్థితుల్లో అదే సమస్యపై మళ్లీ అర్జీ రావడానికి వీల్లేదని స్పష్టం చేశారు. ఈ నెల 18 నుంచి 28 వరకు ప్రత్యేక ఆధార్ శిబిరాలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. సమావేశంలో డీఆర్వో భవానీ శంకర్, సబ్ కలెక్టర్ శేష శైలజ సీతారామారావు, వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

విశాఖ చిత్రకారునికి అరుదైన గౌరవం



కె.శ్రీనివాసరావును సత్కరిస్తున్న అతిథులు



చిత్రకారుడు గీసిన 'జాగువర్ విత్ కళంకారి' చిత్రం

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కళలు, సాంస్కృతిక శాఖ సహకారంతో క్రియేటివ్ ఫైన్ ఆర్ట్స్ అకాడమీ గుంటూరులో నిర్వహించే ఇండియన్ ఆర్ట్ ఫెస్టివల్‌లో భాగంగా నిర్వహించిన జాతీయ చిత్రకళా పోటీలలో విశాఖ నగరం డాబాగార్డెన్స్ ప్రాంతానికి చెందిన చిత్రకారుడు కనుమూరి శ్రీనివాసరావు పంపిన చిత్రం 'జాగువర్ విత్ కళంకారి' అనే చిత్రం ప్రగతి చిత్ర అవార్డు గెలుచుకుంది. మన ఆంధ్రప్రదేశ్ సాంప్రదాయ చిత్ర కళ కళంకారిని తనదైన శైలిలో చూపించిన నేపథ్యంలో ముఖ్య అతిథుల నుంచి ప్రగతి చిత్ర అవార్డును శ్రీనివాసరావు అందుకున్నారు. ది బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా జనరల్ సెక్రటరీ తన్నీరు శ్రీనివాసరావు, ప్రముఖ చిత్రకారులు డా.జి.వై.గిరి సమక్షంలో సత్కరించడం ఆనందంగా ఉందని శ్రీనివాసరావు తెలిపారు.

జీబీఎస్ కలకలం

... 5వ పేజీ తరువాయి

చెబుతున్నారు. ఈ విధానంలో భాగంగా మైలిన్ పొరను డ్యామేజ్ చేసే యాంటీబాడీస్‌ను తొలగిస్తారు. తద్వారా రోగి వేగంగా కోలుకునేలా చేస్తారు. అయితే, ఈ విధానంలో బీపీ తగ్గడం, ఇన్‌ఫెక్షన్లు రావడం వంటి ఇబ్బందులు ఉంటాయి. కొందరు రోగులకు ఇంజెక్షన్లు ఇవ్వడంతోపాటు ఈ విధానంలో కూడా చికిత్స అందించాల్సి ఉంటుంది.

వ్యాధి నిరోధక శక్తి పెంపుతో వ్యాధికి అడ్డుకట్ట



ఈ వ్యాధి ఎవరికైనా రావచ్చు. వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్న వారిపై దీని ప్రభావం అధికంగా ఉంటుంది. కాబట్టి, వ్యాధి నిరోధక శక్తిని పెంచుకునే మార్గాలపై దృష్టిసారించాలి. అతిగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. వైరస్, బాక్టీరియా బారినపడి కోలుకున్న తరువాత ఈ వ్యాధికి సంబంధించిన లక్షణాలు కనిపిస్తే మాత్రం అప్రమత్తం కావాలి. ఆ తరహా లక్షణా లన్నీ జీబీఎస్ కాకపోవచ్చు. కొన్నిసార్లు ఇతర కారణాలతో ఇటువంటి లక్షణాలు కనిపిస్తుంటాయి. నెర్వ్ కండక్షన్ స్టడీ నిర్వహించి నిర్ధారిస్తాం. బయట ఐదు వేలు విలువజేసే ఈ పరీక్షను ప్రతిరోజూ పది మందికి ఉచితంగా కేజీహెచ్‌లో నిర్వహిస్తున్నాం. - డాక్టర్ ఎస్.గోపి, న్యూరాలజీ విభాగాధిపతి, కేజీహెచ్

రికార్డుల ట్యాంపరింగ్‌పై లోతైన విచారణ

... 5వ పేజీ తరువాయి

వారంతా ఉన్నత స్థాయిలో ఒత్తిడి తీసుకువచ్చి చర్యలు తీసుకోకుండా పైరవీలు చేశారు.

ఇదిలావుండగా మధురవాడ సర్వే నంబర్లు 367, 368, 369, 370లో ప్రభుత్వ రికార్డులు ట్యాంపర్ వ్యవహారంపై విచారణ చేయాలని 2023లో అప్పటి రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ ఇచ్చిన ఆదేశాలకు లోబడి జేసీకి విచారణ బాధ్యతలు అప్పగిస్తూ గత ఏడాది సీసీఎల్ఏ ఉత్తర్వులు ఇచ్చారు. ఈ మేరకు తాజాగా ఏడుగురు (అప్పటి 'ఎఫ్' సెక్షన్ సూపరింటెండెంట్లుగా పనిచేసి ప్రస్తుతం పలుచోట్ల డిప్యూటీ కలెక్టర్లుగా పనిచేస్తున్న పి.ధర్మచంద్రారెడ్డి (ప్రస్తుతం పార్వతీపురం మన్యం జిల్లా కేఆర్ఆర్‌సీ ఎస్డీసీ), ఎస్‌డీ అనిత (విశాఖ జిల్లా ఏపీఐఐసీ ఎస్డీసీ), డి.ప్రమీలా గాంధీ (బొబ్బిలిలో భూసేకరణ ఎస్డీసీ), కె.సుబ్బారావు (కాకినాడలో దేవదాయ శాఖ ప్రాంతీయ కమిషనర్), అప్పట్లో 'ఎఫ్' సెక్షన్‌లో టైపిస్టుగా చేసిన బి.రవికుమార్ (పాడేరులో గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ తహసీల్దారు), ఆర్వీ మురళీధర్ (అనకాపల్లి జిల్లా బుచ్చెయ్యపేట తహసీల్దారు కార్యాలయంలో డీటీ), జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేసిన కె.విజయభాస్కర్ (విశాఖలోని పెదగంట్యాడ తహసీల్దారు కార్యాలయం డీటీ)) అధికారులు ఈ నెల 22వ తేదీ ఉదయం 10.30 గంటలకు విశాఖపట్నం జాయింట్ కలెక్టర్ ఎదుట విచారణకు హాజరుకావాలని నోటీసులు జారీచేయడం రెవెన్యూ వర్గాల్లో కలకలం రేపింది.

పెద్దాస్పత్రిలో ఇమ్యునోగ్లోబులిన్స్ ఇంజెక్షన్ల కొరత

... 5వ పేజీ తరువాయి

రూ.15 వేలు ఉంటే...అందులో ఐదు గ్రాముల వరకూ మాత్రమే ఉంటుంది. అంటే, రోగికి ప్రతిరోజూ కనీసం ఐదు నుంచి ఏడు వరకు ఇంజెక్షన్లు చేయాల్సి ఉంటుంది. తక్కువలో తక్కువ రోజుకు కనీసం లక్ష రూపాయలు ఖర్చు అవుతుంది. అయితే కేజీహెచ్‌కు గడిచిన కొన్ని రోజులు నుంచి ఈ ఇంజెక్షన్ల సరఫరా ఆశించిన స్థాయిలో లేదని చెబుతున్నారు. ఉన్న ఇంజెక్షన్లను కూడా రోగులకు ఇవ్వడం లేదని పేర్కొంటున్నారు. రోజుకు ఒక్కో రోగికి ఐదు నుంచి ఏడు వరకు ఇంజెక్షన్లు అవసరం ఉంటే...ఒక్కటి కూడా ఇవ్వడం లేదు. ఈ వ్యాధి బారినపడి సోమవారం చనిపోయిన మహిళకు 11 రోజుల వ్యవధిలో సుమారు పది వరకు ఇంజెక్షన్లు చేయగా, వాటిలో రెండు మాత్రమే కేజీహెచ్ నుంచి ఇచ్చినట్టు చెబుతున్నారు. మిగిలినవి కుటుంబసభ్యులు బయట కొనుగోలు చేసుకున్నట్టు తెలిసింది. దీనిపై ఆస్పత్రి అధికారులు మాత్రం మాట్లాడడం లేదు. ఆస్పత్రి అధికారులు ఈ మరణాన్ని కూడా జీబీఎస్‌గా నిర్ధారించడం లేదు. గుండెపోటుతో మరణించినట్టు ప్రకటించడం గమనార్హం. ఇదిలావుంటే ఈ మరణాన్ని నిర్ధారించే విషయంలో ఆస్పత్రిలో పెద్ద వివాదమే జరిగినట్టు తెలుస్తోంది. మహిళ మృతి చెందిన వెంటనే జనరల్ మెడిసిన్ విభాగానికి చెందిన వైద్యులు జీబీఎస్‌గా పేర్కొనగా..ఉన్నతాధికారులు నుంచి వచ్చిన ఒత్తిడితో దీన్ని మార్చే ప్రయత్నం జరిగినట్టు ప్రచారం జరుగుతోంది.

షేమ్ సీన్

... 5వ పేజీ తరువాయి

బకాయిలు చెల్లించేస్తారు కాబట్టి సీల్ తొలగించాలని ఆదేశించారు. జోన్-4 అధికారులు చేసేదేమీ లేక సీల్‌ను తొలగించేశారు. తాజాగా వేమన మందిరం లీజుకు ఇచ్చి 25 దాటిపోయింది కాబట్టి, వేలం వేస్తే జీవీఎంసీకి నెలకు కనీసం రూ.రెండు లక్షల ఆదాయం వస్తుందని, ఏపీ మునిసిపల్ యాక్ట్ ప్రకారం ఆ మందిరాన్ని స్వాధీనం చేసుకోవాలంటూ జనసేనకు చెందిన ఒక కార్పొరేటర్ జీవీఎంసీ అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో వారం రోజుల్లోగా ఖాళీ చేయాలని, లేనిపక్షంలో తామే సీల్ వేసి స్వాధీనం చేసుకుంటామని పేర్కొంటూ జోన్-4 అధికారులు నోటీసులు జారీ చేశారు. నోటీసులో పేర్కొన్న గడువు శనివారం నాటికి ముగియడంతో సోమవారం ఉదయాన్నే జోన్-4 అధికారులు వేమన మందిరానికి సీల్ వేసి స్వాధీనం చేసుకున్నారు.

ప్రజా ప్రతినిధుల రంగ ప్రవేశంతో కంగుతిన్న అధికారులు

వేమన మందిరానికి సీల్ వేసిన కొద్దిసేపటికే కూటమికి చెందిన ముగ్గురు ప్రజా ప్రతినిధులు ఒకరి తర్వాత ఒకరు అన్నట్టు జోన్-4 అధికారులకు ఫోన్ చేసి 'వేమన మందిరానికి ఎందుకు సీల్ వేశారు? తక్షణం తొలగించి నిర్వాహకులకు అప్పగించండి.' అంటూ హుకుం జారీచేయడంతో అధికారులు అవాక్కయ్యారు. లీజు కాలపరిమితి 25 ఏళ్లు దాటి సుమారు దశాబ్దం గడుస్తోందని, గతంలో లీజులో దక్కించుకున్న వ్యక్తి కూడా ప్రస్తుతం జీవించి ఉన్నట్టు సమాచారం లేదని అధికారులు వారికి వివరించారు. మునిసిపల్ చట్టం ప్రకారం 25 ఏళ్లకు మించి లీజుకిచ్చే అవకాశం లేదు కాబట్టి తాము చేయగలిగిందేమీ లేదని ప్రజా ప్రతినిధులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. దీంతో ముగ్గురు ప్రజా ప్రతినిధులు నేరుగా ఇన్‌చార్జి కమిషనర్‌గా వ్యవహరిస్తున్న జిల్లా కలెక్టర్‌కే ఫోన్ చేసి ఒత్తిడి చేయడంతో జోన్-4 అధికారులు సీల్ తొలగించాల్సి వచ్చిందని జీవీఎంసీ అధికార వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. చిత్తశుద్ధితో పనిచేసే వారిని ప్రోత్సహించాల్సిన ప్రజా ప్రతినిధులు...అందుకు విరుద్ధంగా, జీవీఎంసీ ఆదాయానికి గండి కొట్టేలా వ్యవహరించడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.

బంక్ కూడలిలో తాటిపూడి పైపు లైనుకు మరమ్మతులు

భవిష్యత్తులో పైపు లైనుపై ఉన్న దుకాణాలను తొలగిస్తారేమోనని వర్తకుల ఆందోళన



మరమ్మతులకు గురైన పైపును మార్చడానికి తవ్వకాలు చేపట్టిన దృశ్యం

గోపాలపట్నం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఇక్కడి పెట్రోల్ బంక్ కూడలిలో పాడైపోయిన తాటిపూడి తాగునీటి పైపు లైనుకు మరమ్మతులు చేపట్టడానికి అధికారులు ఉపక్రమించడంతో వర్తకుల్లో ఆందోళన మొదలైంది. నాలుగున్నర దశాబ్దాల క్రితం తాటిపూడి నుంచి నగరం వరకూ భూగర్భ పైపు లైనును ఏర్పాటు చేశారు. అయితే పైపు లైన్ ఏర్పాటు చేసిన తరువాత వీటిపై భారీగా నిర్మాణాలు వెలశాయి. కాగా చాలామందికి తమ ఇళ్ల కింద తాగునీటి పైపు లైన్ ఉన్న విషయం కూడా తెలియదంటే అతిశయోక్తి కాదు. ఇలాంటి తరుణంలో 23 ఏళ్ల క్రితం తాటిపూడి పైపు లైనుకు సమాంతరంగా మరో పైపు లైనును ఏర్పాటు చేయడంతో దానిపై ఉన్న నిర్మాణాలను తొలగించారు. అదే సమయంలో బంక్ కూడలిలో కూడా పైపు లైనుపై ఉన్న నిర్మాణాలను తొలగించడం జరిగింది. దీంతో చాలాకాలం పాటు పైపు లైనుపై నిర్మాణాలను తొలగించిన చోట కొత్తగా ఏమీ ఏర్పాటు కాలేదు. అయితే కాలక్రమేణా ప్రజాప్రతినిధుల అండతో పైపు లైనుపై మళ్లీ దుకాణాలు వెలశాయి. పైపు లైనుపై నిర్మాణాల వల్ల భూగర్భంలో ఉన్న పైపులపై ఒత్తిడి పెరిగి బంక్ కూడలిలో ఇప్పటివరకు కనీసం పదిసార్లు పైపు లైన్ పగిలి ఈ ప్రాంతమంతా జలమయమైంది. ఒకానొక దశలో పైపు లైనుపై దుకాణాలను తొలగించడానికి మళ్లీ ప్రయత్నాలు జరిగాయి. కానీ రాజకీయ నేతల అండదండలతో తొలగింపుల ప్రక్రియ ముందుకు జరగలేదు.

తాజాగా తాటిపూడి పైపు లైనుపై సర్వే నిర్వహించిన అధికారులు పైపు లైన్ పగిలిన చోట కొత్త పైపులు ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా గోపాలపట్నం బంక్ కూడలిలో తరచూ పైపు లైన్ పగిలేచోట కొత్తవి ఏర్పాటు చేస్తున్నారు. అయితే భవిష్యత్తులో ఈ సమస్య జఠిలమైతే పైపు లైనుపై ఉన్న దుకాణాలను పూర్తిగా తొలగించే అవకాశం లేకపోలేదనన్న ఆందోళన వర్తకుల్లో మొదలైంది.

ఈ ఏడాదైనా శివయ్య దర్శనం సజావుగా లభించేనా!

- గత సంవత్సరం మహా శివరాత్రి పర్వదినాన అప్పికొండ శివాలయం వద్ద ఇష్టారాజ్యంగా వ్యవహరించిన వైసీపీ నాయకులు
- తీవ్ర ఇబ్బందులకు గురైన భక్తులు
- ఈసారి ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున అధికారుల ఆధ్వర్యంలో ఉత్సవాల నిర్వహణ



పురాతనమైన అప్పికొండ సోమేశ్వరాలయం

ఉక్కుటౌన్‌షిప్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మహా శివరాత్రి సందర్భంగా పురాతనమైన అప్పికొండ సోమేశ్వరాలయంలో భక్తులకు ఈ ఏడాదైనా స్వామివారి దర్శన భాగ్యం సులభంగా లభిస్తుందా అని భక్తులు ఎదురుచూస్తున్నారు. గత ఏడాది మహా శివరాత్రి పర్వదినాన శివయ్యను దర్శించేందుకు భక్తులు నానాపాట్లు పడ్డారు. గత ఏడాది వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉండడంతో ఆలయ ప్రాంగణమంతటినీ ఆ పార్టీ నాయకులు తమ ఆధీనంలోకి తీసుకుని ఇష్టారాజ్యంగా వ్యవహరించారన్న ఆరోపణలు ఉన్నాయి. తమకు నచ్చిన వారికి వీవీపీ దర్శన భాగ్యం కల్పించారన్న విమర్శలు వెల్లువెత్తాయి. వైసీపీ కార్యకర్త అయితే చాలు.. వీవీపీ దర్శనం లభించింది. దీంతో సామాన్య భక్తులు స్వామివారిని దర్శించేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నందున ఈ నెల 26న మహా శివరాత్రి పర్వదినాన స్వామివారి దర్శనం సజావుగా జరుగుతుందని ప్రజలు ఆశిస్తున్నారు.

కోడ్ ప్రభావంతో రాజకీయ నాయకులు దూరం..

ఈ ఏడాది ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున అప్పికొండ ఆలయం వద్ద రాజకీయ నాయకులు దూరంగా ఉంటారని తెలుస్తుంది. ఇటీవల ఆలయ ప్రాంగణం వద్ద ఆర్డీవో సమక్షంలో ఏర్పాట్లపై ఆయా విభాగాల అధికారులు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎన్నికల కోడ్ సందర్భంగా రాజకీయ నాయకులు దూరంగా ఉండడంతో అధికారులే మహా శివరాత్రి ఉత్సవాలను నిర్వహించనున్నారు. ఈ ఏడాదైనా సామాన్య భక్తులకు స్వామివారి దర్శన భాగ్యం బాగా జరిగేలా అధికారులు చూడాలని పలువురు భక్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.



సుదర్శన యాగం చేస్తున్న అర్చకులు

సామూహిక సుదర్శన యాగం

వేపగుంట, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 98వ వార్డు పరిధి సింహపురికాలనీలో శ్రీసీతారామాలయ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం ఆలయంలో లోక కల్యాణార్థం సామూహిక సుదర్శన యాగం చేశారు. అలాగే ఆదివారం రాత్రి స్వామివారి ఉత్సవమూర్తులను సింహపురికాలనీ, లేఅవుట్ పరిసర ప్రాంతాల్లో మేళతాళాలతో ఊరేగించారు. ఆలయంలో ఉదయం, సాయంత్రం భక్తి గీతాలను ఆలపించడంతో పాటు సుందరకాండ పారాయణాన్ని పఠించారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో సీతారాములను దర్శించుకున్నారు.

సినిమా గైడ్

- **లైలా:** శ్రీ వెంకటేశ్వర-1, రమాదేవి, శ్రీరామా, గోకుల్, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), మోహిని (గాజువాక), మౌర్య (గోపాలపట్నం),
- **తండేల్:** జగదాంబ, సంగం, కామేశ్వరి, శ్రీవెంకటేశ్వర, శ్రీలీలామహల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ(గోపాలపట్నం), అన్నపూర్ణ(కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ)
- **మదగజరాజ:** జగదాంబ, సౌజన్య (గోపాలపట్నం),
- **సంక్రాంతికి వస్తున్నాం:** శారద, మెలోడి, జగదాంబ, కాంతి, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), తాతా, రాములమ్మ (తగరపువలస)
- **డాకు మహారాజ్:** శరత్, శ్రీకన్య, కిన్నెర, సుకన్య, మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్, సప్తగిరి (తగరపువలస)
- **గేమ్ ఛేంజర్:** మెలోడి, సంగం, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), కన్యకాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 36, టమాటా 10, వంకాయలు (తెలుపు) 14, వంకాయలు (నలుపు) 18, బెండకాయలు 42, పచ్చిమిర్చి 32, కాకరకాయలు 34, బీరకాయలు 54, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 14, క్యాబేజి 12, క్యారెట్ 27 దొండకాయలు 28, బంగాళ దుంపలు 13, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 60, అల్లం (పాతది)48, బరబాటి 28, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 26, దోస కాయలు 28, వెల్లుల్లి (పెద్దవి) 120, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 36, కీర దోస 32, కాప్సికమ్ 38, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 32 చిలగడదుంపలు 34, కంద 64, దేముడు చిక్కుడు 28, గోరు చిక్కుడు 30, కూర పెండలం 26, బ్రకోలి 55 , నూల్‌కోల్ 30, పనసపొట్టు 200, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్ద కట్ట) 15, పుదీన (కట్ట) 4, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 80, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 20, మామిడి అల్లం 46, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	465
విజయనగరం	469
శ్రీకాకుళం	469

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	90
లైవ్ ధర	100
విత్ స్కిన్	190
స్కిన్‌లెస్	200

రహదారి విస్తరణను సమాంతరంగా చేపట్టాలని ఆందోళన

- ప్రజలకు జరిగిన అన్యాయంపై న్యాయ పోరాటం చేస్తాం: మాజీ కార్పొరేటర్ శరగడం చిన అప్పలనాయుడు



రహదారి విస్తరణలో భాగంగా అలైన్‌మెంట్‌కు విరుద్ధంగా జరుగుతున్న డ్రైనేజీ పనులను నిరసిస్తున్న శరగడం చినఅప్పలనాయుడు, బాధితులు

పెందుర్తి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఆస్తులకు నష్టం కలిగించేలా రహదారి అలైన్‌మెంట్‌కు విరుద్ధంగా విస్తరణ పనులు చేపట్టడంపై పెందుర్తిలో మాజీ కార్పొరేటర్ శరగడం చినఅప్పలనాయుడు ఆధ్వర్యంలో సోమవారం పలువురు బాధితులు ఆందోళన చేశారు. రహదారి మధ్యస్తం గుర్తించకుండా కొంతమంది సొంత ప్రయోజనాల కోసం రోడ్డు విస్తరణ పనుల్ల వ్యత్యాసం చూపుతున్నారని, నివాసితుల ప్రయోజనాలను పట్టించుకోకుండా.. నోటీసులు ఇవ్వకుండానే పనులు చేస్తున్నారని ఆరోపించారు.

పెందుర్తి రాజు చెరువు నుంచి రైల్వే స్టేషన్ వరకు రహదారి విస్తరణ పనుల్లో భాగంగా డ్రైనేజీ నిర్మాణం కోసం రోడ్డుకిరువైపులా సుమారు 90 అడుగులు పైబడి పనులు చేపట్టారు. దీంతో పలువురు బాధితులు ఈ సమస్యను మాజీ కార్పొరేటర్ దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన డ్రైనేజీ పనులను పరిశీలించారు. రహదారి మధ్యస్తాన్ని గుర్తించకుండా వందడుగులు విస్తరణలో సెంటర్ పాయింట్ నుంచి కాకుండా ఇరువైపులా అలైన్‌మెంట్ నిబంధనలకు విరుద్ధంగా విస్తరణ పనులు జరగుతున్నాయని పలువురు బాధితులు ఆరోపించారు. విస్తరణ పనులను సమాంతరంగా కాకుండా వ్యత్యాసం చూపుతూ పనులు చేపడుతున్నారని వాపోయారు. దీనివల్ల స్థానికంగా ఉంటున్న పలువురి ఇళ్లు, వ్యాపారులకు సంబంధించిన ఆస్తులను నష్టపోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. పరిహార టీడీఆర్ లేకుండానే పనులు జరుపు తున్నారని పేర్కొన్నారు. అనంతరం శరగడం చిన అప్పలనాయుడు మాట్లాడుతూ ఇది సర్వీసు రోడ్డు అని, పెందుర్తిలో వందడుగులు రహదారి అవసరం లేదన్నారు. రహదారి విస్తరణలో భాగంగా ప్రజల ఆస్తులకు నష్టం వాటిల్లిన వారికి టీడీఆర్‌లు ఇవ్వలేదని ఆరోపించారు. టీడీఆర్‌లు ఇచ్చేంతవరకు పనులు చేపట్ట రాదన్నారు. బాధితులకు జరిగిన అన్యాయంపై న్యాయ పోరాటం చేస్తామన్నారు. అలాగే స్థానిక ఎమ్మెల్యేకు, కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్‌ల దృష్టికి సమస్యలను తీసుకువెళతామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ చైర్మన్ గొర్లె రామునాయుడు, పెద్దసంఖ్యలో బాధితులు పాల్గొన్నారు.

వైభవంగా ముగిసిన సాయిబాబా ఆలయ వార్షికోత్సవాలు



సాయినాథునికి హారతిస్తున్న పల్లా శ్రీనివాసరావు, పక్కన పాలతో ఉన్న కలశాలను ఊరేగింపుగా ఆలయానికి తెస్తున్న భక్తులు

కూర్మన్నపాలెం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 86వ వార్డు పరిధి శాతవాహన నగర్‌లో షిర్డీ సాయిబాబా ఆలయ 20వ వార్షికోత్సవాలు సోమవారంతో వైభవంగా ముగిశాయి. ఈ సందర్భంగా ప్రధాన అర్చకులు ఇరగవరపు వెంకట శ్రీధర్‌స్వామి ఆధ్వర్యంలో సాయినాథునికి 216 కలశాలతో సుమారు వెయ్యి లీటర్ల పాలతో భక్తుల చేతుల మీదుగా సామూహిక అభిషేకం నిర్వహించారు. వేకువజాము నుంచే పంచామృతాభిషేకాలు, సహస్రనామార్చన, మహా పూర్ణాహుతి, తదితర పూజాది కార్యక్రమాలతో పాటు విశిష్ట హోమాలను జరిపారు. స్వామివారి దర్శనానికి వందలాది భక్తులు తరలిరావడంతో ఆలయ సరిసరాల్లో సందడి వాతావరణం నెలకొంది. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, టీడీపీ వార్డు ఇన్‌చార్జి నల్లూరు సూర్యనారాయణ, నాయకుడు వేగుంట శ్రీనివాస్, తదితరులు సాయిబాబా ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

వేకువజామున నగర సంకీర్తన

ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని వేకువజాము నాలుగు గంటలకే సాయిబాబా ఉత్సవ విగ్రహాన్ని వెండి పల్లకీలో అధిష్ఠింపజేసి దత్తసాయి భజన కమిటీ నగర సంకీర్తనలు చేపట్టారు. భారీ ఎత్తున అన్న సమారాధన చేపట్టారు. సాయంత్రం వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు, బాణసంచా కాల్పులు, మేళతాళల నడుమ సాయినాథున్ని పల్లకీలో ఊరేగించారు. కార్యక్రమంలో దత్తసాయి మందిర కమిటీ ప్రతినిధులు బండ్రెడ్డి శేషగిరిరావు, కాట్రగడ్డ దుర్గాప్రసాద్, వేములపల్లి రామచంద్రరావు, ఎం.శ్రీనివాసరావు, పి.ధనుంజయరెడ్డి, సీహెచ్ సాయిరామ్, ఎం.రామకృష్ణ, వి.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

నాయుడుతోటలో పట్టపగలు చోరీ

- మహిళపై పెప్పర్ స్ప్రే చల్లి పావుతులం బంగారు చైన్, రోల్డ్ గోల్డ్ పుస్తెలతాడుతో పారిపోయిన దుండగుడు



బాధితురాలు భారతితో మాట్లాడుతున్న ఎస్ఐ సత్యనారాయణ

వేపగుంట, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): నాయుడుతోట సాయిమాధవనగర్‌కు వెళ్లే మార్గంలో గెడ్డను ఆనుకుని ఉన్న ఓ ఇంట్లోకి వెనక నుంచి దొంగ పట్టపగలు ప్రవేశించి చోరీకి పాల్పడ్డాడు. ఆ ఇంట్లోని మహిళపై పెప్పర్ స్ప్రే చల్లి ఆమె మెడలో ఉన్న పావు తులం బంగారు చైన్, రోల్డ్ గోల్డ్ పుస్తెలతాడును తెంచుకుని పారిపోయాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఇక్కడి గెడ్డను ఆనుకుని ఉన్న ఇంట్లో బండారు భారతి (27) అనే మహిళ భర్త, ఇద్దరు పిల్లలతో కలిసి ఉంటుంది. లిఫ్ట్ ఆపరేటర్‌గా పని చేస్తున్న భర్త పనికి, పిల్లలు పాఠశాలకు ఉదయం వెళ్లిపోయారు. ఉదయం 10 నుంచి 11 గంటల సమయంలో వెనక నుంచి ఇంట్లోకి ప్రవేశించిన దుండగుడు ఆమెపై పెప్పర్ స్ప్రే చల్లడంతో ఆమె కళ్లు మంటలకు గురై కింద పడిపోయింది. దీంతో ఆమె మెడలో ఉన్న బంగారు చెయిన్‌తో పాటు, రోల్డ్ గోల్డ్ పుస్తెలతాడును పట్టుకుపోయాడు. కాసేపటికి తేరుకున్న భారతి బయటకు వచ్చి కేకలు వేస్తూ చుట్టుపక్కల వారికి జరిగిన విషయాన్ని చెప్పింది. స్థానికులు పెందుర్తి పోలీసులకు సమాచారం అందించడంతో సీఐ సతీశ్‌కుమార్, క్రైమ్ సీఐ, ఎస్ఐ, సిబ్బంది వచ్చి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పరిసరాలోని సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించి, నిందితున్ని పట్టుకునేందుకు యత్నిస్తున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా నాయుడుతోట, వేపగుంట శివారు ప్రాంతాల్లో వరుస దొంగతనాలతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

అక్కిరెడ్డిపాలెం. ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): బీహెచ్‌పీవీ జంక్షన్ వద్ద ఈ నెల 13న జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి ఆదివారం రాత్రి మృతి చెందారు. గాజువాక పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాతయ్యపాలేనికి చెందిన భువనగిరి బుజ్జి (42) గాజువాకలోని ఓ ప్రైవేటు కంపెనీలో సేల్స్ బాయ్‌గా పనిచేస్తున్నారు. 13వ తేదీ సాయంత్రం విధులు ముగించుకుని తన ద్విచక్ర వాహనంపై ఇంటికి వస్తుండగా బీహెచ్‌పీవీ కూడలి సమీపంలో వెనక నుంచి గుర్తు తెలియని వాహనం ఆయన వాహనాన్ని ఢీకొంది. దీంతో రోడ్డుపై పడిపోయిన బుజ్జి తలకు తీవ్ర గాయాలవ్వడంతో స్థానికులు చికిత్స నిమిత్తం ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అయితే పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడ నుంచి కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. బుజ్జికి భార్య స్వాతి, ఇద్దరు చిన్నపిల్లలు ఉన్నరు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులు అన్ని రంగాలలో రాణించాలి

అగనంపూడి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాలలోనూ రాణించాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. 85వ వార్డు పరిధి గొన్నవానిపాలెంలో గల ఏబీఎస్ పబ్లిక్ స్కూల్ 18వ వార్షికోత్సవానికి ఆదివారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేయడంతో పాటు గాల్లోకి బెలూన్‌లను ఎగురవేశారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. గత ఏడాది పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు రౌతు శ్రీనివాస్, ఇల్లపు వరలక్ష్మి, మాజీ కార్పొరేటర్ దుల్ల లక్ష్మీరామునాయుడు, ఎంఈవోలు సాయిశైలజ, దివాకర్, టీడీపీ నాయకుడు దశేంద్ర తదితరులు పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామికి మొక్కు చెల్లించిన 'పల్లా'

కూర్మన్నపాలెం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 86వ వార్డు పరిధిశాతవాహన నగర్‌లోని అభయాంజనేయస్వామి ఆలయానికి టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు విచ్చేసి తన మొక్కును చెల్లించారు. సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అత్యధిక మెజారిటీ సీట్లతో అధికారంలోకి వస్తే అన్ని కొబ్బరికాయలు చెల్లిస్తానని స్వామివారికి పల్లా మొక్కుకున్నారు. ఈ క్రమంలో 164 సీట్లతో కూటమి ప్రభుత్వం అధికారం లోకి రావడంతో 164 కొబ్బరికాయలను స్వామివారికి చెల్లించారు. కార్యక్రమంలో టీడీపీ 'గాజువాక' ఇన్‌చార్జి ప్రసాదుల శ్రీనివాస్, నాయకుడు వేగుంట శ్రీనివాస్, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉక్కు మహిళా ఉద్యోగులకు అవార్డులు

ఉక్కుటౌన్‌షిప్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ మహిళా ఉద్యోగులు ప్రతిష్ఠాత్మకమైన స్పెషల్ పార్టిసిపేషన్ అవార్డులను అందుకున్నారు. ఢిల్లీలో సోమవారం జరిగిన 35వ జాతీయ ప్రభుత్వ రంగ మహిళా ఫోరం (విప్స్) సమావేశంలో స్కోప్ (స్టాండింగ్ కాన్ఫరెన్స్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్) డైరెక్టర్ జనరల్ అతుల్‌సోబ్టి చేతుల మీదుగా స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు డాక్టర్ సుజాత (ఉక్కు ఆస్పత్రి గైనకాలజిస్టు), మాదారం మైన్స్ సీనియర్ ల్యాబ్ టెక్నీషియన్ రేష్మా సుల్తానాలు అవార్డులు అందుకున్నారు. విధి నిర్వహణలో ఉత్తమ పనితీరు కనబరిచినందుకు గాను వీరు ఈ అవార్డులు పొందారు.

ఉద్యోగులను తగ్గిస్తే ఉత్పత్తి ఎలా పెంచుతాం

ఉక్కు సీజీఎంతో ఇంటక్ నాయకులు

ఉక్కుటౌన్‌షిప్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంటులో ఉత్పత్తి పెంచమంటున్నారు.. మరోపక్క ఉద్యోగుల సంఖ్య తగ్గిస్తున్నారని, దీనివల్ల ఇబ్బందులు వస్తాయని సీజీఎం (వర్క్స్) మహంతికి ఇంటక్ నాయకులు వివరించారు. సోమవారం ప్లాంటులో సీజీఎంతో ఇంటక్ నాయకులు సమావేశమై పలు విషయాలను చర్చించారు. ప్లాంట్‌లో భద్రత లోపిస్తుందని, ఉద్యోగులపై పని ఒత్తిడి పెరుగుతుందన్నారు. అంతేకాకుండా వేతనాలను సక్రమంగా చెల్లించకపోవడంతో ఉద్యోగులు, కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కార్మికుల ప్రధాన సమస్యలను పరిష్కరించాలని కోరారు. సీజీఎంను కలిసిన వారిలో నాయకులు మంత్రి రాజశేఖర్, పీవీ రమణమూర్తి, కారు రమణ, తదితరులు ఉన్నారు.

'కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు చెల్లించాలి'

పెదగంట్యాడ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంటులో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు సత్వరమే వేతనాలు చెల్లించాలని ఇంటక్ ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మిక సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు కురందాసు వంశీకృష్ణ యాజమాన్యాన్ని కోరారు. రెండు నెలలుగా జీతాల్లేక కాంట్రాక్టు కార్మికులు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటివరకు కాంట్రాక్టు కార్మికులకు మూడు నెలల వరకు గేటు పాసులు జారీ చేసేవారని, ఇప్పుడు 15 రోజులకే వచ్చి, ఆ తర్వాత రెన్యువల్ చేయించుకోవాలని చెప్పడం దారుణమన్నారు. ఈ విధానాన్ని విడనాడి పాత పద్ధతిలోనే మూడు నెలలకోసారి గేట్ పాసులు జారీ చేయాలని కోరారు.

శ్రీకృష్ణుని పాదాలను తాకిన ఆదిత్యుని కిరణాలు



పెందుర్తి-రూరల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మాఘ మాస కృష్ణపక్ష పంచమి పర్వదినమైన సోమవారం ఉదయం 95వ వార్డు పరిధి లక్ష్మీపురం గవరపాలెంలోని శ్రీగోపాలకృష్ణ ఆలయంలో మూలవిరాట్ పాదాలను ఆదిత్యుని కిరణాలు తాకాయి. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి ఈ దృశ్యాన్ని వీక్షించారు. శ్రీకృష్ణునికి అర్చకులు ప్రత్యేక పూజలు చేసి హారతులిచ్చారు.

మానవత్వం చాటిన ట్రాఫిక్ పోలీసులు



అస్వస్థతకు గురైన వ్యక్తిని ఆస్పత్రికి తరలిస్తూ..

సింధియా, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): కాన్వెంట్ బ్రిడ్జి సమీపంలో గల రోడ్డుపై నడుస్తూ వెళ్తున్న ఓ వ్యక్తి సోమవారం ఒక్కసారిగా ఛాతీ నొప్పి రావడంతో అస్వస్థతకు గురై కుప్పకూలి పడిపోయాడు. అయితే అక్కడే విధులు నిర్వహిస్తున్న హార్బర్ ట్రాఫిక్ ఏఎస్ఐ గణేశ్ గమనించి వెంటనే తమ సిబ్బందితో కలిసి ఆ వ్యక్తిని నీడలోకి తీసుకువెళ్లి సపర్యలు చేయడంతో పాటు ఆ వ్యక్తి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అంతేకాక 108 వాహనంలో ఆస్పత్రికి తరలించారు. దీంతో ట్రాఫిక్ పోలీసులు మానవత్వం చాటారంటూ స్థానికులు ఏఎస్ఐ గణేశ్‌ను, సిబ్బందిని అభినందించారు.

'థర్మల్ ఫ్లూయిడ్స్'పై విద్యార్థులకు అవగాహన

అగనంపూడి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): దువ్వాడ విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాలలో మెకానికల్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం అప్లికేషన్స్ ఆఫ్ థర్మల్ ఫ్లూయిడ్స్ అనే అంశంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. నిట్ మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి సంతోశ్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మెకానికల్ రంగంలో వస్తున్న విప్లవాత్మకమైన మార్పులకు అనుగుణంగా రాణించాలన్నారు. ఆ తరువాత విజ్ఞాన్ యాజమాన్య ప్రతినిధులు సంతోశ్‌కుమార్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జె.సుధాకర్, రెక్టార్ మధుసూదనరావు, హెచ్‌వోడీలు రాంబాబు, శృతి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టిఫీషియల్ జ్యూవెలరీ తయారీలో శిక్షణ

మల్కాపురం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): కోరమాండల్ ఎరువుల కర్మాగారం సౌజన్యంతో మహిళలకు ఆర్థికంగా చేయూతనిచ్చేందుకు గాను ఆర్టిఫీషియల్ జ్యూవెలరీ తయారీ కోర్సులో మహిళలకు శిక్షణ ఇచ్చే కార్యక్రమాన్ని హనుమాన్ సంజీవ్ కాలనీలో సోమవారం ప్రారంభించారు. సంస్థ డీజీఎం (హెచ్‌ఆర్) రెడ్డిపల్లి శ్రీనివాసరావు జ్యోతి ప్రజల్వన చేసి మాట్లాడారు. 45 రోజుల పాటు 30 మంది మహిళలకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. శిక్షణ పూర్తి చేసిన వారికి కిట్‌ను కూడా అందజేస్తామన్నారు. కార్యక్రమంలో సీఎస్ఆర్ డిప్యూటీ మేనేజర్ శేషపు వెంకటరమణ, వెనీలా, వేణుగోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

శెట్టిబలిజల సమస్యలపై వినతి

అగనంపూడి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 79వ వార్డు పరిధి శనివాడ ప్రాంతంలో గల శెట్టిబలిజలపై సమస్యలపై టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును సోమవారం పలువురు సంఘం ప్రతినిధులు కలిసి వినతిపత్రం అందజేశారు. ముఖ్యంగా గ్రామంలో సామాజిక అవసరాల కోసం కమ్యూనిటీ భవనం నిర్మించాలని కోరారు. ప్రస్తుతం భవనం లేకపోవడంతో శుభ కార్యక్రమాలు చేపట్టేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. అలాగే ఆలయ నిర్మాణానికి స్థలం కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. పల్లాను కలిసిన వారిలో సంఘం ప్రతినిధులు నెల్లి శ్రీనివాసరావు, నాయుడు, చంద్రశేఖర్, చినతల్లి, వరలక్ష్మి, భవానీ, నాగమణి, అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

మసాజ్ ముసుగులో వ్యభిచారం: ముగ్గురి అరెస్టు

కూర్మన్నపాలెం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మసాజ్ సెంటర్ (స్పా) ముసుగులో జరుగుతున్న వ్యబిచారాన్ని దువ్వాడ పోలీసులు బట్టబయలు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కూర్మన్నపాలెంలో ఎస్ఎస్ బ్యూటీ బార్‌లో గత మూడేళ్లుగా మసాజ్ సెంటర్‌ను నిర్వహిస్తున్నారు. కాగా డయల్ 100కు వచ్చిన సమాచారం మేరకు దువ్వాడ సీఐ మల్లేశ్వరరావు ఆ మసాజ్ సెంటర్ (స్పా)పై ఆదివారం రాత్రి దాడి చేశారు. గాజువాక శ్రీనివాసనగర్‌కు చెందిన ఆర్.దీక్షిత్‌కుమార్ వివిధ జిల్లాల నుంచి యువతులు, మహిళలను ఇక్కడకు తీసుకువచ్చి వారితో మసాజ్‌తో పాటు వ్యభిచారం నిర్వహిస్తున్నట్టు పోలీసుల విచారణలో తేలింది. దీక్షిత్‌తో పాటు ఆయనకు సహకరిస్తున్న అనకాపల్లి జిల్లా చోడవరం సమీపం లక్ష్మీపురానికి చెందిన బి.మాధవరావును, విటుడు బోలేరామ్ దేవసిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఆర్థిక ఇబ్బందుల వల్ల మసాజ్‌తో పాటు వ్యభిచారం చేస్తున్న ఓ మహిళను హోమ్‌కు తరలించినట్టు పోలీసులు తెలిపారు.

పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

సింధియా, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలందరికీ ప్రభుత్వం ఇంటి స్థలం కింద రెండు సెంట్లు మంజూరు చేయాలని, అలాగే ఇంటి నిర్మాణం కోసం రూ.ఐదు లక్షలు కేటీయించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు గుడాల రాంబాబు కోరారుజ 63వ వార్డు పరిధి కాకరలోవ భగత్ సింగ్ జంక్షన్ వద్ద సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో పేదల నుంచి దరఖాస్తుల సేకరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు వై.కనకరాజు, కామేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పరిశోధన పరుగుపెట్టేలా..!

పరిశోధకులకు అవసరమైన పరికరాలను అందించే ఐ స్టెమ్

- స్టార్టప్ ఎంటర్‌ప్రెన్యూర్స్, పరిశ్రమ నిర్వాహకులకు మేలు
- 2022లో ప్రారంభించిన కేంద్ర ప్రభుత్వం
- ఔత్సాహికుల్లో ఇప్పటికీ కొరవడిన అవగాహన
- తక్కువ ఖర్చుతో పరిశోధనలు చేసే అవకాశం
- లాగిన్ అయిన ఏయూ, గీతం, ఐఐపీఈ వర్సిటీలు
- విశాఖలో సుమారు 20కు పైగా కళాశాలల్లో అందుబాటులో రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ల్యాబ్‌లు



I-STEM Linking Researchers and Resources

(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి):

భిన్నమైన అంశాలపై పరిశోధనలు సాగించే వారికి అధునాత పరికరాలు అందుబాటులో లేకపోవ డంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో వారి పరిశోధనలకు ఆటంకం ఏర్పడుతోంది. దీనిని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం పరిశోధకులకు అవసరమైన అధునాత పరికరాలను సమకూర్చేందుకు సిద్ధమైంది. ఇందులో భాగంగానే భారత ప్రభుత్వ ప్రిన్సిపల్ సైంటిఫిక్ అడ్వైజరీ కార్యాలయం ఇంటరాక్టివ్ పోర్టల్ ఐ స్టెమ్‌ను రూపొంది ంచింది.

ఇండియన్ సైన్స్ టెక్నాలజీ అండ్ ఫెసిలిటీస్ మ్యాప్ (ఐ స్టెమ్) పేరుతో అందుబాటులోకి వచ్చిన ఈ పోర్టల్‌లో దేశంలోని వివిధ యూనివర్సిటీలు, కాలేజీల్లో ఉన్న రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ (ఆర్అండ్‌డీ) ల్యాబ్‌ల వివరాలు ఉంటాయి. వాటిల్లో ఉండే పరికరాలతో పరిశోధనలు చేయాలనుకునే వారంతా కొంత మొత్తాన్ని చెల్లించి పరిశోధనను పూర్తిచేసుకోవచ్చు. కొన్ని ఆర్అండ్‌డీ ల్యాబ్‌ల్లో ఉండే పరికరాలు స్టార్టప్స్ ఎంటర్‌ప్రెన్యూర్స్, పరిశ్రమల నిర్వాహకులు తమ పనితీరును మెరుగుపర్చుకునేందుకు ఉపయోగపడతాయి. వారు ఈ పోర్టల్‌లో రిజిస్టరైన పరికరాలను వినియోగించుకోవచ్చు.

దేశ వ్యాప్తంగా 3,310 ఇనిస్టిట్యూట్లు ఈ పోర్టల్‌లో ఇప్పటికే రిజిస్టర్ చేసుకోకాగా, వివిధ ల్యాబ్‌లలో 26,738 పరికరాలు అందుబాటులో ఉన్నాయి. వివిధ రంగాలకు చెందిన 582 మంది నిపుణులు సహకరించేందుకు సిద్ధంగా ఉన్నారు. ఇప్పటివరకు 33,619 మంది పరిశోధకులు ఆర్అండ్‌డీ ల్యాబ్‌ల్లోని పరికరాల సాయంతో పరిశోధనలు సాగించారు. మరో 34,773 బుకింగ్ రిక్వెస్ట్‌లు వచ్చాయి.

జిల్లాలో ల్యాబ్‌లు..

ఐ స్టెమ్ పోర్టల్‌లో జిల్లాకు సంబంధించిన అనేక కాలేజీలు, యూనివర్సిటీల్లోని రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ (ఆర్అండ్‌డీ) ల్యాబ్‌లు రిజిస్టర్ అయ్యాయి. ఈ ల్యాబ్‌ల్లో పరిశోధకులు, ఎంటర్‌ప్రెన్యూర్స్ పరిశ్రమలకు సంబంధించిన ప్రతినిధులు తమ పరిశోధనకు సంబంధించిన పనులను ఇందులో పూర్తిచేసుకోవచ్చు. ముందుగా ఐ స్టెమ్ వెబ్‌సైట్‌లోకి వెళ్లి రిజిస్టర్ చేసుకోవాలి. అనంతరం ఎంతదూరంలో పరిశోధనకు వెళ్లాలి అని భావిస్తున్నారో దానిని ఎంపిక చేసుకోవాలి. ఆ తరువాత ఏయే ధరల్లో పరిశోధనకు సంబంధించిన పరికరాలు కావాలో ఎంపిక చేసుకోవాలి. ఆ తరువాత అవైలబులిటీలో ఉన్న తేదీలను చూసుకుని ఎంపిక చేసుకుంటే స్లాట్ లభిస్తుంది.ఆ సమయంలో వెళ్లి ఆర్అండ్‌డీ ల్యాబ్‌లో పరిశోధన చేసుకోవచ్చు.

ప్రస్తుతం జిల్లాలో సుమారు 20కిపైగా కాలేజీల్లోని ఆర్అండ్‌డీ ల్యాబ్‌లకు చెందిన పదులసంఖ్యలో పరికరాలు ఈ పోర్టల్‌లో రిజిస్టర్ చేశారు. ఇందులో ఆంధ్ర విశ్వవిద్యాలయం, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం వర్సిటీ అండ్ ఎనర్జీ (ఐఐపీఈ), గీతం, గాయత్రీ విద్యా పరిషత్, సెయింట్ జోసెఫ్‌తోపాటు మరికొన్ని కాలేజీలు ఉన్నాయి. ఈ పరికరాలపై పరిశోధన చేసేందుకు గంటలు, రోజుల వారీగా అవకాశం లభిస్తుంది.

అధునాత పరికరాలు..

పోర్టల్‌లో ఇప్పటివరకు రిజిస్టర్ అయిన ఆర్అండ్‌డీ ల్యాబ్‌ల్లో అధునాత పరికరాలున్నాయి. వీటిలో ఎక్స్‌ఆర్‌డీ, ఎన్ఎంఆర్, మైక్రోస్కోప్, స్టిమ్యులేటెడ్ ఎమిషన్ డెప్లేషన్ (స్టెడ్), ఎక్స్‌ఆర్‌డీ, ఆప్టికల్ మైక్రోస్కోప్, సింగిల్ క్రిస్టల్ ఎక్స్‌ఆర్‌డీ స్మార్ట్ అల్ట్రా ఫర్ అవైలబుల్ టెంపరేచర్ డేటా, రామన్ స్పెక్ట్రోస్కోపీ, యూవీ విజుబుల్ స్పెక్ట్రోమీటర్, హై రిజల్యూషన్ ఎక్స్‌ఆర్‌డీ వంటి వందలాది అధునాతన పరికరాలున్నాయి. పరిశోధనలకు అవసరమైన పరికరాల ను అందుబాటులో ఉంచాలన్న ఉద్దేశంతోనే ఈ పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు ఐ స్టెమ్ పోర్టల్ నేషనల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ హరిలాల్ భాస్కర్ తెలిపారు. పరిశోధకులు, పరిశోధన ల్యాబ్స్‌కు అనుసంధానం చేసే బాధ్యతను తీసుకునే ఉద్దేశంతో దీనిని రూపొందించినట్లు వెల్లడించారు. పరిశోధకులు, స్టార్టప్ నిర్వాహకులు, పరిశ్రమలు ప్రతినిధులు సద్వినియోగం చేసుకుని మరింత ప్రగతి సాధించాలని ఆకాంక్షించారు.



నగరంలో ఇటీవల ఐ-స్టెమ్‌పై నిర్వహించిన సమావేశానికి హాజరైన ఔత్సాహికులు

కలెక్టరేట్‌కు చేరిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బ్యాలెట్ పత్రాలు



బ్యాలెట్ పేపర్లను పరిశీలిస్తున్న ఎన్నికల సిబ్బంది

విశాఖపట్నం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి ఈనెల 27న జరగనున్న ఎన్నికలకు సంబంధించి బ్యాలెట్ పత్రాలు సోమవారం కలెక్టరేట్‌కు చేరుకున్నాయి. ఓటర్లు, పోలింగ్ కేంద్రాలు, పోటీచేసే అభ్యర్థుల ఫొటోలు, ఇతర వివరాలతో కూడిన నివేదిక కర్నూలులో ఉన్న ప్రభుత్వ ప్రింటింగ్ ప్రెస్‌కు పంపారు. ఈ మేరకు బ్యాలెట్ పత్రాలు ముద్రించారు. పదిశాతం రిజర్వుతో కలిపి జిల్లాలో పోలింగ్ కేంద్రాలు, ఓటర్ల సంఖ్యకు సరిపడా పత్రాలను స్థానిక అధికారులు భద్రపరిచారు. అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, డీఆర్వో బీహెచ్. భవానీ శంకర్ ప్రక్రియను పర్యవేక్షించారు. అనంతరం సంబంధిత వాహనానికి పోలీసులు, లైజనింగ్ అధికారుల సమక్షంలో సీల్ వేసి ఉత్తరాంధ్రలో మిగిలిన జిల్లాలకు పంపారు.

గ్రీన్‌బెల్ట్‌లో మొక్కలు నాటారు



గ్రీన్‌బెల్ట్‌లో జీవీఎంసీ సిబ్బంది నాటిన మొక్కలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

విశాఖపట్నం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై గ్రీన్‌బెల్ట్‌లో ఆక్రమణలను జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు తొలగించారు. ఇసుకతోట జంక్షన్ నుంచి మద్దిలపాలెం వైపు దారిలో జూపిటర్ హోండా షోరూం వద్ద గ్రీన్‌బెల్ట్‌ను ఆక్రమించి సెకండ్‌హ్యాండ్ కార్ల షోరూం నిర్వహించడంపై 'ఆంధ్రజ్యోతి'లో పలుమార్లు కథనాలు ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు గ్రీన్‌బెల్ట్‌లో ఆక్రమణలను తొలగించినా, వెంటనే మళ్లీ కార్లను పెట్టేవారు. దీనిపై ఇటీవల కథనం ప్రచురితమవడంతో అధికారులు మరోసారి తొలగించారు. ఆక్రమణలు జరగకుండా మొక్కలు నాటాలని హార్టికల్చర్ విభాగం అధికారులకు సూచించారు. ఆ విభాగం సిబ్బంది సోమవారం మొక్కలు నాటేందుకు గోతులు తవ్వడం ప్రారంభించగా ఓ ప్రజాప్రతినిధి అధికారులకు ఫోన్‌చేసి మొక్కలు నాటవద్దని, అది ప్రైవేటు స్థలమని హెచ్చరించారు. అయినప్పటికీ అధికారులు మొక్కలను నాటారు. గ్రీన్‌బెల్ట్‌లో ఆక్రమణలను తొలగించి పచ్చదనం పెంపొందించే చర్యలు తీసుకోవడంతోపాటు, స్థలం అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకున్న అధికారులను స్థానికులు అభినందించారు.

ప్రత్యామ్నాయ ఇంధన వనరులను అన్వేషించాలి

- సముద్ర కెరటాలు, గాలి నుంచి విద్యుత్‌ను ఉత్పత్తి చేసే సాంకేతికతను అభివృద్ధి చేయాలి
- నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ డైరెక్టర్ ప్రకాష్ చౌహాన్



సదస్సును ప్రారంభిస్తున్న నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ డైరెక్టర్ ప్రకాష్ చౌహాన్

విశాఖపట్నం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): దేశంలో ప్రత్యామ్నాయ ఇంధన వనరులను అన్వేషించాలని నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ డైరెక్టర్ ప్రకాష్ చౌహాన్ పేర్కొన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం జియోఫిజిక్స్ విభాగం ప్లాటినం జూబ్లీ వేడుకలను సోమవారం వైఏఎస్ మూర్తి ఆడిటోరియంలో నిర్వహించారు. 'అడ్వాన్స్‌స్ ఇన్ జియో ఫిజిక్స్ ఫర్ సస్టైనబులిటీ డెవలప్‌మెంట్, ఎనర్జీ, ఎన్విరాన్‌మెంట్ అండ్ నేచరల్ రీసోర్సెస్' పేరుతో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. సుదూర తీర ప్రాంతం కలిగిన భారత్‌లో సముద్ర కెరటాలు, గాలి నుంచి కూడా విద్యుత్‌ను ఉత్పత్తి చేసే సాంకేతికతను అభివృద్ధి చేయాలని సూచించారు. విలువైన మానవ వనరులను ఏయూ జియో ఫిజిక్స్ విభాగం అందించిందని కొనియాడారు. జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా డిప్యూటీ డైరెక్టర్ జనరల్ జి.సుజిత్‌కుమార్ త్రిపాఠి మాట్లాడుతూ సుస్థిరమైన భవిష్యత్తుకు, పర్యావరణ సమస్యలకు పరిష్కారాలు చూపించేలా యువత పనిచేయాలన్నారు. ఏయూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జి.శశిభూషణరావు మాట్లాడుతూ యువత సాంకేతికతపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో సైన్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎంవీఆర్ రాజు, జియో ఫిజిక్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ సీవీ నాయుడు, ప్రొఫెసర్ లక్ష్మీపతిరాజు, ప్రొఫెసర్ రాజేంద్రప్రసాద్, ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ టి.హరినారాయణ, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సదస్సు ప్రత్యేక సంచికను విడుదల చేశారు. విభాగ ఆవరణలో ప్రత్యేక ఎక్స్‌పో నిర్వహించారు. కీలక ప్రాజెక్టులు, పరిశోధనలను ప్రదర్శించారు.

పనితీరు మార్చుకోని అటవీశాఖ అధికారులు

- అస్తవ్యస్తంగా తాబేళ్ల హేచరీ నిర్మాణం





తీరంలో ఏర్పాటు చేసిన హేచరీ, (ఇన్‌సెట్లో) దూరంగా పాతిన కర్రలు

విశాఖపట్నం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): సముద్ర తాబేళ్ల రక్షణ వ్యవహారంలో అటవీశాఖ తీరు మారడం లేదు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బీచ్‌రోడ్డు కురుసుర మ్యూజియం సమీపంలో రెండోసారి హడావిడిగా ఏర్పాటుచేసిన హేచరీ పరిశీలిస్తే క్షేత్రస్థాయి అధికారుల పనితీరు బయటపడుతోంది. తాబేళ్ల గుడ్లు ఇసుకతో భద్రపరిచేందుకు ఏర్పాటుచేసిన హేచరీస్‌పై బీచ్ ప్రేమికులు పెదవివిరుస్తున్నారు. ఇసుకతో భద్రపరిచిన గుడ్ల కోసం కక్కలు సులువుగా హేచరీస్‌లోకి వెళ్లేలా వెదురు కర్రలు పాతారు. తాబేళ్ల గుడ్లకు రక్షణగా లోపలకు కుక్కలు ఇతర జంతువులు వెళ్లకుండా హేచరీ నిర్మించాల్సి ఉంది. కానీ అదేదీ పట్టకుండా సరైన పర్యవేక్షణ లేకపోవడంతో కూలీలు దూరం దూరంగా కర్రలు పాతారు. కురుసుర మ్యూజియం సమీపంలో వారం క్రితం అడ్డదిడ్డంగా హేచరీ నిర్మించిన విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తేవడంతో అప్పటికప్పుడు దానిని తొలగించారు. మళ్లీ అదే చోట నిర్మించిన హేచరీ తాబేళ్ల గుడ్ల రక్షణకు ఏమాత్రం అనువుగా లేకపోవడం గమనార్హం.

కేజీహెచ్ వైద్యుడిపై ఆరోగ్యశాఖ మంత్రి చర్యలు

- ఫిర్యాదుల నేపథ్యంలో బదిలీ వేటు
- స్పందించని కేజీహెచ్ అధికారులు

విశాఖపట్నం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : కేజీహెచ్‌లోని ఆర్థో విభాగంలో పనిచేస్తున్న ఓ వైద్యుడిపై ఆరోగ్యశాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు అందిన ఫిర్యాదులపై చర్యలు తీసుకున్నారు. ఈ విభాగంలోని వైద్యుడు వికలాంగులకు ఇచ్చే సదరం సర్టిఫికెట్ల జారీలో అక్రమాలకు పాల్పడడం, శస్త్ర చికిత్సల్లో వైఫల్యాలు, వైద్య విద్యార్థుల పట్ల దురుసుగా ప్రవర్తించడం, ఉన్నతాధికారులు ఆదేశాలు పాటించకపోవడం, ఆపరేషన్లకు డబ్బులు వసూలు చేస్తుండడంపై మంత్రికి పలువురు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ప్రాథమిక ఆధారాలను సేకరించి, ఏలూరు ఆస్పత్రికి బదిలీ చేసినట్టు చెబుతున్నారు. అందిన ఫిర్యాదులపై సమగ్ర విచారణ చేపట్టాలని ఆస్పత్రి అధికారులకు మంత్రి కార్యాలయం నుంచి ఆదేశాలు జారీ అయినట్టు చెబుతున్నారు. అయితే దీనిపై ఆస్పత్రి అధికారులు స్పందించడం లేదు.

సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీల ఆందోళన

- జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలు

సిరిపురం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీల వేతనాలు పెంచాలని, గ్రాట్యూటీ అమలుచేయాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఏపీ అంగన్‌వాడీల వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ధర్నాకు ముఖ్య అతిథిగా హాజరైన సుబ్బరావమ్మ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు, మినీ వర్కర్లు అనేక సేవలుందిస్తున్నామన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వారికి వేతనాలు పెరగలేదన్నారు. సమస్యల పరిష్కారం కోసం గతంలో 42 రోజుల సమ్మె చేశామని, ఆ సమయంలో 2024 జూలైలో వేతనాలు పెంచుతామని, సమస్యలు పరిష్కరిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చినా ఇప్పటివరకు పరిష్కారం కాలేదన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం నిరసన కార్యక్రమాలు చేపట్టామన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు కనీసం వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, గ్రాట్యూటీ అమలుచేయాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని, హెల్పర్ల ప్రమోషన్లకు నిర్దిష్ట గైడ్‌లైన్స్ రూపొందించి అమలుచేయాలని, సాధికారత సర్వేలో ప్రభుత్వ ఉద్యోగులు పదాన్ని తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.వెంకటలక్ష్మి, ఎల్.దేవి, అర్బన్ అధ్యక్ష, కార్యదర్శులు నూకరత్నం, కృపారాణి, కోశాధికారి పద్మ, ఉపాధ్యక్షులు శోభారాణి, నాగేశ్వరి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్కేఎస్వీ కుమార్, కార్యదర్శి జి.అప్పలరాజు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రైం... crime news

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



కర్రి సాయి శరణ్ మృతదేహం

జి.మాడుగుల, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయ పడిన ఓ యువకుడు చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. పోలీ సులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. విశాఖ జిల్లా పెందుర్తి మండ లానికి చెందిన కర్రి సాయి శరణ్ ఓ శుభకార్యం నిమిత్తం బైక్‌పై జి.మాడుగుల మండలం ఎస్.కొత్తూరుకు ఆదివారం వచ్చాడు. తిరుగు ప్రయాణంలో జి.మాడుగుల- మద్దిగరువు ప్రధాన రహదారి గుదలంవీధి సెల్ సిగ్నల్ పాయింట్ సమీపానికి వచ్చేసరికి రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. అతను తీవ్రంగా గాయపడడంతో పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం సోమవారం కేజీహెచ్‌కి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

చంపుతానని బెదిరించిన భర్తపై కేసు



వివరాలు సేకరిస్తున్న పోలీసులు

కంచరపాలెం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): తనపై పెట్టిన కేసును వెనక్కి తీసుకోకపోతే భార్య, ఇద్దరు పిల్లలను చంపుతానని కత్తితో బెదిరించిన భర్తపై కంచరపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. ఐటీఐ జంక్షన్ తుమ్మడిపాలెం ప్రాంతానికి చెందిన చుక్కా గణేష్ బర్మాక్యాంప్‌లో ఉంటున్న సుభాషిణిని 2018లో ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి కుమార్తె, కుమారుడున్నారు. వివాహం జరిగినప్పటి నుంచి గణేష్ పనికి వెళ్లకపోవడంతో కుటుంబం గడవక సుభాషిణి పిల్లలను తీసుకుని తల్లి వద్దకు వెళ్లి ఉంటోంది. గణేష్ భార్యపై అనుమానంతో నిత్యం ఇంటికి వెళ్లి కొట్టేవాడు. తీవ్ర హింసలకు గురిచేస్తుండడంతో సుభాషిణి పోలీసులకు పలుమార్లు ఫిర్యాదు చేసింది. ఫలితం లేక చివరికి దిశ పోలీసులను ఆశ్రయించింది. వారు గణేష్‌పై వేధింపుల కేసు నమోదు చేశారు. తనపై పెట్టిన కేసును వెనక్కి తీసుకోవాలంటూ సుభాషిణిని ఇబ్బంది పెట్టేవాడు. ఈ నేపథ్యంలో గణేష్‌పై మళ్లీ ఫిర్యాదు చేసింది. పోలీసులు కౌన్సెలింగ్‌కు పిలిచినా గణేష్ వెళ్లలేదు. ఈ నేపథ్యంలో ఆదివారం బర్మా క్యాంప్‌లో భార్య ఇంటికి వెళ్లి తనపై పెట్టిన కేసును వెనక్కి తీసుకోకపోతే నిన్ను, పిల్లలను చంపేస్తానని కత్తితో దాడికి యత్నించగా సుభాషిణి తల్లి అడ్డుకుంది. జరిగిన విషయాన్ని పోలీసులకు ఫోన్ ద్వారా సమాచారం అందించడంతో గణేష్ జారుకున్నాడు. సోమవారం పోలీసులు విచారించారు. సీఐ రవికుమార్ నేతృత్వంలో ఏఎస్ఐ రత్నం కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రికవరీ మొబైల్స్‌ను బాధితులకు అందించిన రైల్వే పోలీసులు



బాధితులకు మొబైల్ ఫోన్లను అందజేస్తున్న రైల్వే పోలీసులు

విశాఖపట్నం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): రైళ్లలోనూ, ప్లాట్‌ఫామ్‌లపై అపహరించిన సుమారు రూ. 10 లక్షల విలువైన 54 మొబైల్ ఫోన్లను రైల్వే పోలీసులు రికవరీ చేశా రు. జీఆర్పీ స్టేషన్‌లో నమోదైన కేసుల ఆధారంగా ఫిర్యాదు చేసిన బాధితులను సోమవారం స్టేషన్‌కు పిలిపించారు. రైల్వే డీఎస్పీ పి.రామచంద్రరావు వారికి మొబైల్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ అపహరించిన మొబైళ్లు హైదరాబాద్, గుంటూరు, విజయవాడ, కాకినాడ, రాజమహేంద్రవరం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో రికవరీ చేసినట్లు పేర్కొన్నారు. ఎస్‌హెచ్‌వో సీహెచ్.ధనుంజయనాయుడు పర్యవేక్షణలో సబ్ ఇన్‌స్పెక్టర్లు ఎస్.కె.మారూఫ్, ఎస్.రామారావు, హెడ్ కానిస్టేబుల్ ఎల్.ఉదయ్‌భాస్కర్, కానిస్టేబుళ్లు భాగ్యరాజ్, శివ, మహేష్, దుర్గాప్రసాద్, వర్మ, రాజేష్‌లు చాకచక్యంగా మొబైళ్లను రికవరీ చేశారని తెలిపారు.

సూపర్‌బజార్ తనఖాపై పోలీసులకు ఫిర్యాదు

మహారాణిపేట, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): సూపర్‌బజార్‌ను తనఖా పెట్టడంపై సంబంధిత అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సుహాస్ మాల్ అండ్ ట్రేడింగ్ కంపెనీ వ్యాపారం నిమిత్తం సూపర్‌బజార్‌ను లీజుకు తీసుకుంది. ఈ సమయంలో వారు సూపర్‌బజార్ ఆస్తులను నిబంధనలకు విరుద్ధంగా బ్యాంక్‌లో తనఖా పెట్టి డబ్బులు తీసుకున్నారు. తిరిగి చెల్లించకపోవడంతో బ్యాంక్ వారు నోటీసులు పంపారు. బ్యాంకు నుంచి నోటీసులు రావటంతో తనఖా విషయం బయటపడి కంగుతిన్న సూపర్‌బజార్ అధికారులు ఈ వ్యవహారాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వ సూచన మేరకు సోమవారం టూటౌన్ పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉండగా అందిన ఫిర్యాదుపై చర్యలు తీసుకునేందుకు వీలుగా న్యాయ సలహాలు, సూచనలు తీసుకుంటున్నట్లు స్టేషన్ అధికారి తెలిపారు.

బైక్ ఢీకొని ఇద్దరు విద్యార్థినులకు తీవ్ర గాయాలు

భీమునిపట్నం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఎగువపేట జిల్లా పరిషత్ గెస్టహౌస్ రహదారిలో సోమవారం ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ఇద్దరు బీఈడీ విద్యార్థినులకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చేపలుప్పాడ గోవుపేటకు చెందిన ఐటీఐ విద్యార్థి వాసుపల్లి హరీశ్ తన స్నేహితుడి ద్విచక్ర వాహనంపై తగరపువలస నుంచి ఇంటికి బయలుదేరారు. జడ్పీ గెస్ట్‌హౌస్ వై-జంక్షన్ వద్దకు వచ్చేసరికి సెడార్‌లో బీఈడీ చదువుతున్న ఇద్దరు విద్యార్థినులను వెనుకనుంచి బలంగా ఢీకొన్నారు. దీంతో సవర సుజాత, పాంగి శ్రావణి తీవ్రంగా గాయపడ్డారు. అల్లూరి సీతారామరాజు జిల్లా అరకుకు చెందిన వీరిద్దరూ ఇక్కడ బీఈడీ చదువుతూ సాంఘిక సంక్షేమశాఖ వసతిగృహంలో ఉంటున్నారు. వారిని డైట్ విద్యార్థులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సుజాత పరిస్థితి విషమంగా ఉండడంతో కేజీహెచ్‌కు తరలించారు. ప్రమాదానికి కారణమైన హరీశ్‌కు గాయాలవడంతో ప్రభుత్వాస్పత్రికి తరలించినట్టు సీఐ సుధాకర్ తెలిపారు. హాస్టల్ వార్డెన్ ఆనంద్‌కుమార్, సుజాత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రూ.32 లక్షల చోరీ సొత్తు స్వాధీనం



చోరీ సొత్తు చూపుతున్న డీసీపీ కె.లతామాధురి

మహారాణిపేట, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): రెండు ఇళ్లలో చొరబడి సుమా రు రూ.32 లక్షల విలువ చేసే బంగారం, వెండి వస్తువులు, రూ. లక్ష నగదు అపహరించిన పాత నేరస్థుడిని అరెస్టు చేసినట్టు డీసీపీ కె.లతామాధురి తెలిపారు. పోలీసు కమిషనరేట్‌లో సోమవారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. ఈ నెల 14న తెల్లవారుజామున 2.30 గంటలకు, మరుసటిరోజు ఉదయం 11 గంటలకు రాజీవ్‌నగర్‌లోని రెండు ఇళ్లలో చోరీలు జరిగాయి. ఓ ఇంట్లో మూడున్నర తులాల బంగారం, మరో ఇంటిలో 28 తులాల బంగారం, కిలో వెండి, రూ.లక్ష నగదు అపహరణకు గురైనట్టు బాధితులు ఫిర్యాదు చేశారు. నిందితుడి ఆచూకీని సీసీ కెమేరాల ఫుటేజీల ద్వారా కనుగొన్నారు. అతడు వినియోగించిన ద్విచక్ర వాహనం మల్కాపురంలో ఉన్నట్టు తెలుసుకున్నారు. వాహనం నెంబరు ఆధారంగా పాత నేరస్థుడైన వంటినూనెల కృష్ణ చోరీలకు పాల్పడినట్లు గుర్తించారు. అతడిని ఆదివారం మల్కాపురంలో అదుపులోకి తీసుకొని విచారించారు. 32 తులాల బంగారం, వెండి వస్తువులు, రూ.73 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. అతడిపై సుమారు 20 కేసులున్నాయి. అనేక సార్లు జైలుకు వెళ్లి వచ్చాడు. అతడికి దుష్ప్రవర్తన (బీసీ షీట్) చరిత్ర ఉందన్నారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.